


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 205 | శుక్రవారం 31- 07 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


## నీట్ రీ-ఎగ్జామ్ మార్కులపై వివాదం.. విద్యార్థులకు హైకోర్టు షాక్



## సిదిరితో జగన్ ములాఖత్ రద్దు



**సాయంత్రం 5 తరవాత**
**జైలు వద్దకు జగన్**
**నిబంధనల మేరకు ములాఖత్**
**కుదరదని తేల్చిన సిబ్బంది**

వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో వైఎస్ జగన్ ములాఖత్‌కు జైలు అధికారులు అనుమతి నిరాకరించారు. నిర్ణయించిన సమయం ముగిసిన తర్వాత జైలు వద్దకు చేరుకోవడంతో, జైలు నిబంధనల ప్రకారం అధికారులు అనుమతి ఇవ్వలేదు. సాయంత్రం 5 గంటల తర్వాత సీదిరి

## జంతర్‌మంతర్ విద్యార్థి ఆందోళనల కేసులపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం



**జంతర్‌మంతర్ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులకు ఊరట**
**క్రిమినల్ నేపథ్యం లేనివారిపై కేసులు ఉండవన్న ఢిల్లీ పోలీసులు**
**అరెస్టైన విద్యార్థుల విడుదల చేస్తామని వెల్లడి**
**నేర చరిత్ర ఉన్నవారిపై చర్యలు కొనసాగిస్తామని స్పష్టీకరణ**
**మొత్తం 13 కేసులు నమోదైనట్లు వెల్లడి**
**సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాతే నిర్ణయం**

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న నిజమైన విద్యార్థులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోమని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల ప్రారంభంలో నమోదైన కేసులపై కీలక నిర్ణయం తీసుకుంటూ, అరెస్టు చేసినా, అదుపులోకి తీసుకున్నా అలాంటి విద్యార్థులను త్వరగా విడుదల చేస్తామని స్పష్టం చేసింది. ఢిల్లీ ప్రభుత్వ హోంశాఖ ప్రధాన కార్యదర్శి సంతోష్ డి. వైద్య విడుదల చేసిన సర్క్యులర్‌లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. నీట్-యూజీ ప్రశ్నపత్రాల లీక్‌కు నిరసనగా నిర్వహించిన ఆందోళనల సందర్భంగా మొత్తం 13 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు.

క్రిమినల్ నేపథ్యంలేని నిజమైన విద్యార్థులపై ఢిల్లీ పోలీసు శాఖ ఎలాంటి చర్యలు చేపట్టబోదని స్పష్టం చేశారు.

## మోదీ ప్రధాని పదవికి రాజీనామా చేసి.. ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి



**ప్రధాని మోదీ పదవికి రాజీనామా చేసి ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని దీప్కే సూచన**
**ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులను ప్రభుత్వాలు వేధిస్తున్నాయని ఆరోపణ**
**వేధింపులు ఆపకపోతే మళ్లీ భారీ స్థాయిలో ఉద్యమం తప్పదని హెచ్చరిక**
**పెల్లెట్ గన్ వాడకంపై అమిత్ షాపై అయినా చర్యలు తీసుకోవాలని డిమాండ్**
**ఫాస్ట్ ట్రాక్ కోర్టుల హామీ ఏమైందంటూ కేంద్రంపై అభిజీత్ దీప్కే విమర్శలు**

'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నీట్ పేపర్ లీక్ వివాదంపై దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్న వేళ, విద్యార్థులను ఉద్దేశించి ప్రధాని సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేయడాన్ని ఎద్దేవా చేస్తూ, మోదీ ప్రధాని పదవి నుంచి తప్పుకుని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారితే బాగుంటుందని వ్యాఖ్యానించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం మహారాష్ట్రలోని తన స్వస్థలానికి చేరుకున్న దీప్కే మీడియాతో మాట్లాడారు. "ప్రధాని మోదీ ఇప్పుడు ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని నేను భావిస్తున్నాను. ఆయన ఆ పనిని చాలా బాగా చేస్తున్నారు. ప్రధాని కుర్చీని ఖాళీ చేస్తే, దేశాన్ని నడిపే బాధ్యతను మరో నాయకుడు చూసుకుంటారు" అని ఆయన అన్నారు.

## పవన్‌తో మంత్రి నిమ్మల భేటీ



**ఎల్‌నినోపై ఇరు నేతల చర్చ**
**ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలన్న పవన్**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం భేటీ అయ్యారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై చర్చించారు. సూపర్ ఎల్‌నినో, తద్వారా రాష్ట్రంలో నెలకొన్న సాగు నీటి సంక్షోభంపై రైతుల్లో అవగాహన కల్పించాలని

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే కఠిన శిక్ష



**పరీక్షల అక్రమాల నిరోధక బిల్లుకు లోక్‌సభ ఆమోదం**
**ఈ సందర్భంగా విద్యార్థులకు నారా లోకేశ్ శుభాకాంక్షలు**
**విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారికి గట్టి హెచ్చరిక అని వ్యాఖ్య**
**నీట్ ఘటన తర్వాత కేంద్రం చేపట్టిన చర్యల ప్రస్తావన**
**బిల్లును స్వాగతించిన పవన్ కల్యాణ్**

## నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై మౌనం ఎందుకు?



**నీట్ పేపర్ లీక్‌పై తన మౌనంపై స్పందించిన రాఘవ్ చద్దా**
**ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నలు వేయడం తన పని అని వెల్లడి**
**ప్రభుత్వంలోకి వచ్చాక పరిష్కారాలు చూపడమే బాధ్యత అని స్పష్టీకరణ**
**విద్యార్థుల కోపం, బాధ సమర్థనీయమేనని అంగీకారం**
**పబ్లిక్ పరీక్షల బిల్లుతో పటిష్టమైన వ్యవస్థను తీసుకొస్తున్నామన్న చద్దా**

## పరామర్శ పేరుతో గొడ్డలి పార్టీ డ్రామాలు




**బలప్రదర్శన కోసమే జగన్ పర్యటన**
**మహిళా ఎస్ఐపై అనుచిత ప్రవర్తన దారుణం**
**జగన్ తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత**

మాజీ మంత్రి సిదిరి అప్పలరాజుకు పరామర్శ పేరుతో గొడ్డలి పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఏపీ హోంమంత్రి అనిత మండిపడ్డారు. గురువారం రాజధాని అమరావతిలో ఆమె మాట్లాడుతూ.. పరామర్శ పేరుతో గొడ్డలి పార్టీ డ్రామాలు ఆడుతోందని విమర్శించారు. జైలు నిబంధనలు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌రెడ్డికి తెలుసునని పేర్కొన్నారు. కానీ కావాలనే ములాఖత్ సమయం పూర్తయ్యాక జైలు వద్దకు ఆయన

## రాజధాని ఎక్కడో చెప్పకుండా పంపించేశారు



**ఆ కసితోనే రాష్ట్ర అభివృద్ధికి పూనుకున్నాం**
**ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్**
**ఆదోనిలో చిన్నారుల కోర్కె నెరవేర్చిన మంత్రి**

రాష్ట్ర విభజన సమయంలో రాజధాని ఎక్కడో చెప్పకుండా మనల్ని గెంటేశారని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆ కసితోనే రాష్ట్రంలో అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. గురువారం కర్నూలులో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. ఏపీకి పరిశ్రమలు వస్తున్నాయని అంటే అందులో ఆ శాఖ మంత్రి టీజీ భరత్ కృషి ఎంతో ఉందని తెలిపారు. ఓ పట్టుదలతో తామంతా పనిచేస్తున్నామని అన్నారు. రిలయన్స్, ఫార్మాతోపాటు ఇతర పరిశ్రమలు కర్నూలు జిల్లాకు వస్తున్నాయని ఆయన వివరించారు. పట్టుదలతోపాటు క్రమశిక్షణతో పనిచేయాలని ఈ సందర్భంగా యువతకు మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ మూడు నెలల్లో (90 రోజుల్లో) వస్తుందని ప్రకటించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

## ఐదు రోజుల పోరాటం విఫలం.. పెద్ది సుదర్శన్‌రెడ్డి కన్నుమూత



**బీఆర్ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతి**
**గుండెపోటుతో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అస్తమయం**
**ఐదు రోజుల పాటు వెంటిలేటర్‌పై ఉన్నా ఫలించని చికిత్స**
**2018లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన సుదర్శన్‌రెడ్డి**
**సాధారణ రైతు కుటుంబం నుంచి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగిన నేత**

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి (52) కన్నుమూశారు. గత ఐదు రోజులుగా గుండెపోటుతో సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన, గురువారం అర్ధరాత్రి 12.50 గంటలకు తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు అధికారికంగా ప్రకటించారు. ఆయన మరణవార్తతో బీఆర్ఎస్ శ్రేణుల్లో, నర్సంపేట

## పరామర్శ పేరుతో గొడ్డలి పార్టీ డ్రామాలు

వెళ్లారని ఆరోపించారు. శ్రీకాకుళంలో మహిళా ఎస్సైపై వైకాపా నేతల దాడిని మహిళా లోకం ఖండించాలని రాష్ట్ర హోంమంత్రి అనిత అన్నారు. విధుల్లో ఉన్న మహిళా ఎస్సైపై జుగుప్సాకరంగా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పట్ల గొడ్డలి పార్టీ నేతల తీరు మారాలన్నారు. వైకాపా నేత సీదిరి అప్పలరాజుతో ములాఖత్‌కు సమయానికి వెళ్లకుండా జగన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సీదిరి అప్పలరాజును కలవాలనుకుంటే ములాఖత్ సమయానికే జగన్ వెళ్లాలి. సమయానికి వెళ్లకుండా రాజకీయాలు చేస్తున్నారు. నిజానికి అప్పలరాజును కలవాలన్న ఆలోచన జగన్‌కు లేదు. ములాఖత్‌కు మధ్యాహ్నం 2-3 గంటల మధ్య అధికారులు సమయం ఇచ్చారు. సాయంత్రం 5 తర్వాత జగన్ వెళ్తే అర్థమేంటి? కేవలం బలప్రదర్శన ఆలోచనే ఆయనకు ఉంది. మహిళా ఎస్సై పట్ల సొంత పార్టీ నేతలు ప్రవర్తించిన తీరుకు జగన్ క్షమాపణ చెప్పాలని అనిత డిమాండ్ చేశారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళానికి బల ప్రదర్శన చేసుకుంటూ వైసీపీ అధినేత వెళ్లారని వివరించారు. అయితే జగన్ పర్యటనలో పోలీసులు ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని గుర్తు చేశారు. మహిళా ఎస్ఐ పట్ల వైసీపీ నేతలు దురుసుగా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎస్ఐపై దురుసుగా ప్రవర్తించినవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అప్పలరాజు కుమారుడు తప్పు చేసినందుకే కేసు పెట్టారని హోం మంత్రి అనిత గుర్తు చేశారు. ఆసుపత్రిలో ఉన్న తన చెల్లిని పరామర్శించడానికి సమయం ఉండదు కానీ.. హిట్ అండ్ రన్ కేసును తారుమారు చేసేందుకు ప్రయత్నించిన మాజీ మంత్రిని పరామర్శించడానికి మాత్రం సమయం ఉంటుందని ఎద్దేవా చేశారు. వక్ర బుద్ధి.. డైవర్షన్ పాలిటిక్స్ చేయడం కోసమే వైఎస్ జగన్ ఇదంతా చేశారని వ్యంగ్యంగా అన్నారు హోం మంత్రి అనిత.

## నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై మౌనం ఎందుకు?

నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వివాదంపై ఇప్పటివరకు తాను ఎందుకు మౌనంగా ఉన్నానో రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా గురువారం వివరణ ఇచ్చారు. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన బాధ్యతలో మార్పు వచ్చిందని, ప్రస్తుతం తాను పరిష్కార మార్గాలను సూచించే స్థానంలో ఉన్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నీట్ పేపర్ లీకేజీపై రాఘవ్ చద్దా ఎందుకు మౌనంగా ఉన్నారంటూ చాలామంది ప్రశ్నించారు. గతంలో నేను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వాన్ని నిలదీయడం నా బాధ్యతగా భావించి, దానిని చిత్తశుద్ధితో నిర్వహించాను. అయితే ఇప్పుడు నా బాధ్యత కేవలం ప్రశ్నలు వేయడమే కాదు, సమస్యకు సరైన పరిష్కారాలను చూపడం. అందుకే ఈ సమస్యకు ఒక నిర్మాణాత్మక పరిష్కారంతోనే ప్రజల ముందుకు రావాలని నిర్ణయించుకున్నాను. ఆ సమయం నేడు ఆసన్నమైంది" అని వివరించారు. పేపర్ లీకేజీలను ఒక తీవ్రమైన రుగ్మతతో పోల్చిన చద్దా, కేవలం మీడియా ప్రకటనల ద్వారా కాకుండా, వ్యవస్థాగత మార్పుల ద్వారానే దీనిని అరికట్టగలమని అభిప్రాయపడ్డారు. పరీక్షలలో అక్రమాలను నిరోధించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును ఒక సమగ్రమైన విధానంగా ఆయన అభివర్ణించారు. సత్వర దర్యాప్తు, ఉన్నత స్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, భవిష్యత్తులో నీట్ పరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించడం వంటి కీలక చర్యలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. నీట్ అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, వారిలో నెలకొన్న ఆవేదన, ఆగ్రహం సమర్థనీయమేనని చద్దా అంగీకరించారు. విద్యార్థుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ప్రభుత్వం స్పందించిందని, పరీక్షా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టిందని ఆయన స్పష్టం చేశారు.

## రాజధాని ఎక్కడో చెప్పకుండా పంపించేశారు

కల్పించడం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. గతంలో తాను చేపట్టిన యువగళం పాదయాత్రలో తనను పత్తికొండలో పోలీసుల ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేశారని.. కానీ ప్రజలు, కార్యకర్తలు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. యువగళంలో ఇచ్చిన మాట ప్రకారం.. 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని భారీగా పరిశ్రమలు తీసుకొస్తున్నామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సోలార్ ప్రాజెక్టులు వస్తుంటే రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యూనిట్‌పై రూ.13 పైసలు తగ్గించామన్నారు. విద్యుత్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌ను మొదటి స్థానంలో ఉంచాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. ఇదిలావుంటే ఇచ్చిన మాట ప్రకారం ఆదోని చిన్నారుల కోరికను మంత్రి నారా లోకేశ్ నెరవేర్చారు. చిన్నారులు సహస్ర ఆద్య, జయ స్కందను కలిసిన మంత్రి వారితో ఫొటో దిగారు. దీంతో చిన్నారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. 'లోకేశ్ సర్ మిమ్మల్ని కలవాలి, మీతో ఫొటో దిగాలని ఉంది' అంటూ ఆదోని చిన్నారుల వీడియో సోషల్ మీడియాలో తెగ హల్‌చల్ చేసింది. వెంటనే ఈ వీడియోపై స్పందించిన మంత్రి.. 'నేను కూడా మిమ్మల్ని కలవాలనుకుంటున్నాను' అంటూ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అంతే కాకుండా చిన్నారుల వీడియోను రీ పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఆదోని పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్.. చెప్పిన మాట ప్రకారం చిన్నారులను కలిశారు. వారితో కలిసి ఫొటో దిగారు. దీంతో ఇద్దరు చిన్నారుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. తమ అభిమాన నాయకుడితో ఫొటో దిగడం పట్ల చిన్నారులు హర్షం వ్యక్తం చేశారు.

## ఐదు రోజుల పోరాటం విఫలం.. పెద్ది సుదర్శన్‌రెడ్డి కన్నుమూత

నియోజకవర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ నెల 26న హనుమకొండలోని తన నివాసంలో ఉన్న సుదర్శన్‌రెడ్డికి ఛాతీలో తీవ్రమైన నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన కార్డియాక్ అరెస్ట్‌కు గురైనట్లు వైద్యులు గుర్తించారు. సుమారు గంట పాటు శ్రమించి, తొమ్మిది సార్లు సీపీఆర్ చేసిన తర్వాత ఆయన గుండె తిరిగి స్పందించింది. దీంతో మెరుగైన చికిత్స కోసం వెంటనే సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రత్యేక వైద్య బృందం ఆయనను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స ప్రారంభించింది. అయితే, సుదీర్ఘకాలం స్పృహలోకి రాకపోవడంతో నాడీ సంబంధిత స్పందన కనిపించలేదు. ఆక్సిజన్ సరఫరాలో అంతరాయం కారణంగా మెదడుకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఈసీజీ, బ్రెయిన్ ఎంఆర్ఐ పరీక్షల్లో తేలిందని వైద్యులు తెలిపారు. ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడిన ఆయన చివరకు కన్నుమూశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో 1974 ఆగస్టు 6న ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన సుదర్శన్‌రెడ్డి, రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. తొలుత కాంగ్రెస్‌లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన, 2001లో టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్)లో చేరారు. అదే ఏడాది నల్లబెల్లి జడ్పీటీసీగా గెలుపొందారు. 2015లో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం 2018 శాసనసభ ఎన్నికల్లో నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు నిధులు విడుదల

ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు భారీ నిధులు విడుదల చేయగా.. 62 లక్షల మందికి లబ్ధి చేకూరనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అమరావతిలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆగస్టుకు సంబంధించి 62,07,573 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించనున్నట్లు వెల్లడించారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమం నేపథ్యంలో ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో ఒకరోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలో 11,98,044 మంది లబ్ధిదారులకు రూ.514.42 కోట్ల పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మిగిలిన జిల్లాల్లో ఆగస్టు 1న రూ.2,198.31 కోట్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విడతలో 50,09,529 మంది లబ్ధిదారులకు పెన్షన్లు అందనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకూ పెన్షన్ల కోసం రూ.70,907.41 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ప్రతి నెలా 1వ తేదీన లబ్ధిదారులకు పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డికి ఏపీడీఏఎస్‌సీఏసీ మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతలు

ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్, అనుబంధ సంస్థ బాధ్యతలను మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డికి అదనపు బాధ్యతలుగా అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జీఓఆర్‌టీ.నం128ను జారీ చేసింది. ఏపీడీఏఎస్‌సీఏసీ మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయ బాధ్యతలను కూడా ఎం. వేణుగోపాల్ రెడ్డి నిర్వహించనున్నారు. కార్పొరేషన్‌కు సంబంధించిన పరిపాలనా, అధికారిక వ్యవహారాలతో పాటు అన్ని ఆర్థిక వ్యవహారాల నిర్వహణ బాధ్యతలనూ వేణుగోపాల్ రెడ్డి చేపట్టనున్నారు. తదుపరి ప్రభుత్వ ఆదేశాలు వెలువడే వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు

### పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
### ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి, ప్రాణహిత నదులు
### మేడిగడ్డ వద్ద వరద ఉధృతితో 85 గేట్లు ఎత్తివేత
### శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పెరిగిన వరద ఉధృతి
### కడెం జలాశయానికి భారీగా వరదనీరు చేరిక
### భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి మట్టం
### ములుగు జిల్లా బొగత జలపాతం సందర్శన నిలిపివేత

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే రానున్న మరో మూడు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణ వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు నదులు, ఉపనదులు పొంగిపొర్లుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ, మహారాష్ట్రల్లోని ఎగువ ప్రాంతాల్లో వర్షాపాతం తీవ్రమవడంతో గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని పలు కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జలాశయాలు సంతరించుకుంటున్న జలకళ రైతుల్లోనూ, ప్రజల్లోనూ తీవ్ర ఆనందాన్ని నింపుతోంది. నిజామాబాద్ జిల్లాలోని ప్రతిష్టాత్మక శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం జలాశయంలోకి 12,900 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, ప్రాజెక్టు నీటి నిల్వ 17.103 టీఎంసీలకు చేరింది. కాకతీయ కాలువ ద్వారా దిగువకు 300 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. అలాగే, నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలంలో ఉన్న స్వర్ణ ప్రాజెక్టుకు ఉదయం వేళకు నీటి సామర్థ్యం అర టీఎంసీ దాటి, ఇన్ ఫ్లో దాదాపు 10 వేల క్యూసెక్కులకు చేరింది. నిర్మల్ జిల్లాకే తలమానికమైన కడెం ప్రాజెక్టుకు వరద నీరు విపరీతంగా పోటెత్తుతోంది. ఉదయం 11:00 గంటల సమయానికి కడెం ప్రాజెక్టుకు ఏకంగా 77,442 క్యూసెక్కుల భారీ ఇన్ ఎ÷-లో నమోదు కాగా, పరిస్థితికి అనుగుణంగా అధికారులు 6 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇక జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద ప్రాణహిత, గోదావరి ఉభయ నదులు పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అక్కడ నీటిమట్టం 6.320 మీటర్ల ఎత్తులో మెట్ల వద్దకు చేరడంతో తీరం కొత్త రూపు సంతరించుకుంది. గోదావరి జలాలు పోటెత్తడంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ కి ఇన్ ఫ్లో భారీగా పెరిగింది. ఎన్డీఎస్ఏ సూచనలను పాటిస్తూ అధికారులు బ్యారేజ్ కి చెందిన మొత్తం 85 గేట్లను ఎత్తి ఉంచారు. ప్రస్తుతం అక్కడ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో సమంగా 1,01,530 క్యూసెక్కులుగా కొనసాగు తుండటంతో గోదావరి ప్రవాహం దిగువకు వేగంగా పయనిస్తోంది. ప్రాజెక్టుల్లో క్రమంగా నీటి నిల్వలు పెరుగుతుండటంతో నీటిపారుదల శాఖ అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురియ నుండటంతో 9 జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఉమ్మడి కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు భారీ వర్షాల నేపథ్యంలో 6 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. భారీ వర్షాలకు ఉత్తర తెలంగాణతో పాటు నిజామాబాద్ జిల్లాలోని చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాలను దృష్టిలో పెట్టుకొని జగిత్యాల జిల్లాలో పాఠశాలలకు సెలవను ప్రకటించారు. ఈ సీజన్‌లో తొలిసారిగా జూరాల ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదలారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితోపాటు,

పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటిమట్టం పెరుగుతోంది. గురువారం ఉదయానికి 27 అడుగులకు చేరింది. నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తున్నది. దీంతో అప్రమత్తమైన ప్రాజెక్టు అధికారులు ప్రాజెక్టు 6 వరద గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఇన్ ఫ్లోగా ప్రాజెక్టులోకి 77,442 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు 6 వరద గేట్లు 10 ఫీట్లు గేట్లు ఎత్తి అవుట్ ఎ÷-లోగా 67, 000 క్యూసెక్కుల నీటిని దిగవనున్న గోదావరిలోకి అధికారులు వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు 3.495 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 693.725 అడుగులు 2.212 టీఎంసీలలో ప్రాజెక్టు నీటి సామర్థ్యం కొనసాగుతుంది. కడెం ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రవాహ ప్రాంతాలకు ఎవరు కూడా వెళ్లకూడదని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని అధికారులు కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు మత్తడి పారుతున్నాయి. ఆదిలాబాద్ సహా ఇంద్రవెల్లి, తలమడుగు మండలాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఉట్నూరు, నార్నూరు, జైనూరు మండలాల్లో రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి నర్సాపూర్, శాంతాపూర్ వాగులు పొంగాయి. దీంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బ్యారేజ్‌కి వరద ప్రవాహం పోటెత్తుతుంది. గురువారం బ్యారేజ్ వద్ద 81,060 క్యూసెక్కుల వరద ప్రవాహం రాగా బ్యారేజ్‌లోని 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరదనీటిని భారీ నీటిపారుదల శాఖ అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బ్యారేజీకి వరద ప్రవాహం మరింత పెరుగుతుందని, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం లో కురుస్తున్న భారీ వర్షానికి చీకుపల్లి అటవీప్రాంతంలో ఉన్న తెలంగాణ నయాగర బొగత జలపాతం ఉప్పొంగింది. జలపాతం ముందు ఉన్న సెల్ఫీ వ్యూ పాయింట్‌పై నుంచి స్విమ్మింగ్ పూల్ మీదుగా ఉధృతంగా ప్రవహించింది. దీంతో బొగత సందర్శనకు అటవీశాఖ అధికారులు మధ్యాహ్నం నుంచి అనుమతి నిలిపివేశారు. తాము టికెట్ తీసుకొని లోపలకు వెళ్లగా అనుమతి లేదని బయటకు పంపించారని, టికెట్ డబ్బులు ఇవ్వాలని అడిగినా అధికారుల నుంచి సమాధానం కరువైందని కొందరు పర్యాటకులు ఆరోపించారు. ఈ విషయంపై ఇన్‌చార్జి రేంజ్ అధికారి నరేందర్‌ను అడగగా అలాంటిదేమీ లేదని, జలపాతం వీక్షించిన తర్వాతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బయటకు పంపించామని తెలిపారు. ఉదయం 6 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా నమోదయిన వర్షపాతం వివరాలు ఇలావున్నాయి. వాజేడులో అత్యధికంగా వాజేడులో 16.5 సెం.మీ. ఏటూరునాగారం, 15.2, సర్వాయిపేటలో 14.3, జైపూర్‌లో 14 సెం.మీ, బెజ్జూరులో 14, సెం.మీ., కన్నాయిగూడెంలో 13 సెం.మీ., వెంకటాపురం, 12.6, ముత్తారం, మహదేవ్‌పూర్ లో 12.2 సెం.మీ., నస్పూర్ 11.8 సెం.మీ. ఆసిఫాబాద్‌లో 11.3 సెం.మీ., సింగరేణి(రెబ్బన)లో 11.2 సెం.మీ., కాగజ్‌నగర్, మేడారంలో 10.6 సెం.మీ., సిర్పూర్(టి)లో 10.5 సెం.మీ., కౌతాలంలో 104, కాటారంలో 10.3, నెన్నెలలో 10.3 సెం.మీ. వర్షపాతం నమోదయింది.

## ఒరిజినల్ డాక్యుమెంట్లు గల్లంతు.. ఎస్బీఐకి వినియోగదారుల కమిషన్ భారీ షాక్

ఖాతాదారుడికి చెందిన కీలకమైన ఆస్తి పత్రాలను పోగొట్టిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)పై రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. బ్యాంకు నిర్లక్ష్యం కారణంగా తీవ్ర మానసిక వేదనకు గురైన బాధితుడికి రూ. 3 లక్షల నష్టపరిహారంతో పాటు, వ్యాజ్యం ఖర్చుల నిమిత్తం మరో రూ. 20,000 చెల్లించాలని ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది. ఇబ్రహీంపట్నం పరిధిలోని బొంగులూరుకు చెందిన బి. వెంకటేశం, ఎస్బీఐ ఆదిభట్ల బ్రాంచ్‌లో రూ. 5 లక్షల గృహ రుణం తీసుకున్నారు. ఈ రుణానికి అదనపు హామీగా తన బంధువు అంజయ్యకు చెందిన 194 చదరపు గజాల ప్లాట్‌కు సంబంధించిన ఒరిజినల్ సేల్ డీడ్, ఇతర లింక్ డాక్యుమెంట్లను బ్యాంకులో సమర్పించారు. మార్చి 2022లో వెంకటేశం రుణం మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించి, బ్యాంకు నుంచి నో-డ్యూస్ సర్టిఫికేట్ కూడా పొందారు.

## మోదీ ప్రధాని పదవికి రాజీనామా చేసి.. ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

ఆందోళన విరమించిన తర్వాత కూడా నిరసనలో పాల్గొన్న విద్యార్థులను వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి వేధిస్తున్నాయని అభిజీత్ దీప్కే ఆరోపణలు చేశారు. "సీజేపీ నిరసన విరమించాక, ప్రభుత్వాలు విద్యార్థులను వేధిస్తున్నాయి. ఈ వేధింపులు ఆపకపోతే, రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతాం" అని హెచ్చరించారు. కేవలం కేంద్రమంత్రి రాజీనామాతో యువతలో ఆగ్రహం చల్లారలేదని, వారి కోపం ప్రభుత్వంపైనే ఉందని స్పష్టం చేశారు. విద్యార్థులపై వేధింపులు కొనసాగితే ఆందోళనను పునఃప్రారంభిస్తామని దీపకే హెచ్చరించారు. "నిరసన ముగిసిందని ప్రభుత్వం భావించకూడదు. ఈ విద్యార్థులు తీవ్రవాదులు కాదు, ఈ దేశ భవిష్యత్తు. దేశ భవిష్యత్తును ఇలా ఇబ్బంది పెడితే, రేపు మేమే ప్రభుత్వాన్ని మారుస్తాం" అని వ్యాఖ్యానించారు. అవసరమైతే తదుపరి ఆందోళన చాలా పెద్ద ఎత్తున ఉంటుందని అన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పెల్లెట్ గన్ ఉపయోగించడంపై బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. "పెల్లెట్ గన్ కాల్పులకు ఆదేశాలు ఇచ్చింది అమిత్ షా అయినా, మరెవరైనా సరే, వారిపై చర్యలు తీసుకోవాలి" అని స్పష్టం చేశారు. పేపర్ లీక్ కేసుల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చినా, తొలి విచారణే సీబీఐ న్యాయవాది హాజరుకాకపోవడంతో వాయిదా పడిందని ఆయన విమర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఆయనను పార్లమెంటులో సన్మానించడంపై బీజేపీని ప్రశ్నించారు. "విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే, ప్రధాన్‌ను సన్మానించడానికి బీజేపీకి సిగ్గుగా అనిపించలేదా?" అని నిలదీశారు. సీజేపీ నిరసనలపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన విమర్శలపై స్పందిస్తూ, ఆమెను 'పార్ట్-టైమ్ రాజకీయ నాయకురాలి'గా అభివర్ణించారు. సీరియస్ రాజకీయ నాయకుల వ్యాఖ్యలకే తాను స్పందిస్తానని అన్నారు.

## పవన్‌తో మంత్రి నిమ్మల భేటీ

పవన్ సూచించారు. రైతులతో ప్రత్యక్ష సమావేశాలు నిర్వహించి పరిస్థితులను వివరించాలన్నారు. సంక్షోభ నివారణకు ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణపై దృష్టి సారించాలని అన్నారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు నిమ్మలకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. నీటి విడుదలతో పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట రైతులకు సాగునీటి సమస్యకు ఊరట లభించిందని పవన్ అన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంపై గ్రామస్థాయిలో ప్రచారం చేపట్టాలని సూచించారు. ప్రతి రైతు పీఎం ఫసల్ బీమా యోజనలో చేరేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం ప్రతి నీటి బొట్టు విలువైనదే అని... నీటి వృథాను అరికట్టాలని చెప్పారు. కాలువల్లో పూడిక తొలగింపు, నీటి గట్టుల లీకేజీల నివారణపై దృష్టి సారించాలన్నారు. కాకినాడ జిల్లా, పిఠాపురంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచనలు చేశారు. ఈ సందర్భంగా భుజం శస్త్రచికిత్స చేయించుకున్న పవన్‌ను మంత్రి నిమ్మల రామానాయుడు పరామర్శించారు. త్వరగా కోలుకుని ప్రజాసేవలో మరింత చురుగ్గా పాల్గొనాలని నిమ్మల ఆకాంక్షించారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే కఠిన శిక్ష:

ప్రభుత్వ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, మాల్‌ప్రాక్టీస్‌కు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026 లోక్‌సభలో ఆమోదం పొందడంపై ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ చట్టం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారికి గట్టి హెచ్చరికగా నిలుస్తుందని చెప్పారు. పరీక్షల విశ్వసనీయతను కాపాడే దిశగా ఇది కీలక అడుగని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన లోకేశ్.. ప్రశ్నపత్రాల లీకేజీలు, పరీక్షల మోసాలకు పాల్పడే వారిపై ఇక కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. చట్టపరమైన చర్యలతో పాటు పరీక్షల వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. యువత భవిష్యత్తు రాజకీయాలకు అతీతమని, ప్రతిభ, పారదర్శకత, సమాన అవకాశాలే ఎప్పుడూ గెలవాలని ఆకాంక్షించారు.నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వేగంగా స్పందించిందని లోకేశ్ అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షను తిరిగి సమయానికి నిర్వహించి, లక్షలాది మంది విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా కాపాడిందని గుర్తుచేశారు. విద్యార్థుల భవిష్యత్తును రక్షించడంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. ఇదే అంశంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా స్పందించారు. ఈ బిల్లు లక్షలాది మంది విద్యార్థుల ఆశయాలను కాపాడే కీలక చట్టమని చెప్పారు. పరీక్షల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే నిర్ణయమిదని అభిప్రాయపడ్డారు. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)లో సమగ్ర సంస్కరణల కోసం నందన్ నీలేకని నేతృత్వంలో ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను కేంద్రం ఏర్పాటు చేయడం కూడా కీలక చర్యగా పేర్కొన్నారు.

## జంతర్‌మంతర్ విద్యార్థి ఆందోళనల కేసులపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం

అయితే ఈ వెసులుబాటు అందరికీ వర్తించదని ప్రభుత్వం తెలిపింది. గతంలో నేర చరిత్ర ఉన్నవారికి ఈ రక్షణ ఉండదని పేర్కొంది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించింది. ఆందోళనల్లో పాల్గొనే ముందు నుంచే క్రిమినల్ కేసులు ఉన్నవారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. నిజమైన విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకునే నిర్ణయానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ టి.ఎస్. సంధూ ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వం వెల్లడించింది. జులై 28న శైలేంద్ర మణి త్రిపాఠి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

# సిదిరితో జగన్ ములాఖత్ రద్దు

అప్పలరాజును కలిసేందుకు వైసీపీ నేతలు అనుమతి కోరారు. ఈ విషయంపై జైలర్.. ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరపగా, జైలు నిబంధనల ప్రకారమే వ్యవహరించాలని అధికారులు స్పష్టం చేశారు. సాయంత్రం 5 గంటలలోపే ములాఖత్‌కు అనుమతి ఉంటుందని తెలిపారు. దీంతో జగన్ అప్పలరాజు ములాఖత్‌కు అనుమతి లభించలేదు. ఇకచేసేది లేక జైలు వద్ద అప్పలరాజు కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించారు. అంతకుముందు విశ్వాఖ చేరుకున్న జగన్ అక్కడి నుంచి రోడ్డు మార్గంలో శ్రీకాకుళం చేరుకున్నారు. ప్రస్తుతం అంపోలు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును ఆయన జైలులో ములాఖత్ ద్వారా పరామర్శించాలనుకున్నారు. ఎన్నికల అనంతరం జగన్ శ్రీకాకుళం జిల్లాకు రావడం ఇదే తొలిసారి కావడంతో వైసీపీ శ్రేణులు ఈ పర్యటనకు ప్రాధాన్యం ఇచ్చాయి. సీదిరి అప్పలరాజు కుమారుడు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనలో, కుమారుడిని కేసు నుంచి తప్పించేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై పోలీసులు అప్పలరాజును అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన శ్రీకాకుళం జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో జగన్ ఆయనను పరామర్శించడానికి ఇక్కడికి చేరుకున్నారు. భోగాపురం, పూసపాటిరేగ, పైడి భీమవరం, రణస్థలం, ఎచ్చెర్ల మీదుగా అంపోలు జిల్లా జైలుకు చేరుకుని మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు అప్పలరాజుతో ములాఖత్ నిర్వహించాలనుకున్నారు. అయితే, వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో ఆంక్షలు విధించారు పోలీసులు.. జైలు వద్ద ములాఖత్‌కు మాత్రమే పోలీసులు అనుమతి ఇచ్చారు. ర్యాలీలు, భారీ జనసమీకరణకు అనుమతి లేదని శ్రీకాకుళం పోలీసులు స్పష్టం చేశారు. గతంలో క్రౌడ్ గ్యాదరింగ్‌ల సమయంలో చోటుచేసుకున్న ఘటనలు, ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన, శాంతిభద్రతల అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు..అయినా జగన్ సమయానికి అక్కడికి చేరుకోలేక పోయారు.

# మిట్నాల గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



## పైప్‌లైన్ పనులను ప్రారంభించిన టీడీపీ నాయకులు శీలం నాగ ప్రదీప్ కుమార్ రెడ్డి

**నంద్యాల సిటీ బ్యూరో జులై 30 ( నంది పత్రిక )** ఎల్‌నినో ప్రభావంతో నంద్యాల నియోజకవర్గ పరిధిలోని మిట్నాల గ్రామంలో ఏర్పడిన తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం లభించనుంది. న్యాయశాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ఆదేశాల మేరకు, యువ నాయకులు ఫిరోజ్ , ఫయాజ్ ల ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో నూతన తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. గ్రామ ప్రజల సహకారం, గ్రామీణ నీటి సరఫరా (ఆర్డబ్ల్యూఎస్) శాఖ అధికారుల సూచనలతో శీలం నాగ ప్రదీప్ కుమార్ రెడ్డి నేతృత్వంలో ఈ పైప్‌లైన్ పనులు శరవేగంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శీలం నాగ ప్రదీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చేయడం కోసం ఈ పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని తెలిపారు. త్వరలోనే పనులను పూర్తి చేసి, ఓవర్‌హెడ్ ట్యాంకుల (రక్షిత మంచినీటి ట్యాంకులు) ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని అన్నారు . మన గ్రామం మన బాధ్యత అనే లక్ష్యంతో గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని వారు తెలిపారు . తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపిన మంత్రి ఫరూక్ గారికి, పనుల ప్రారంభానికి సహకరించిన గ్రామ పెద్దలు, యువత, మరియు గ్రామ ప్రజలకు శీలం నాగ ప్రదీప్ కుమార్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు శీలం రాజేశ్వర్ రెడ్డి , శీలం మహేశ్వర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను కలిసిన ప్రభుత్వ న్యాయవాదులు.. గౌరవ వేతనం పెంచాలని వినతి



**నంద్యాల సిటీ బ్యూరో జులై 30 ( నంది పత్రిక )** రాష్ట్ర న్యాయశాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ను ప్రభుత్వ న్యాయవాదులు నంద్యాలలోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాదుల (గవర్నమెంట్ ప్లీడర్స్) గౌరవ వేతనాన్ని పెంచవలసిందిగా కోరుతూ మంత్రి ఫరూక్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు గవర్నమెంట్ ప్లీడర్ (జి.పి) కృష్ణమూర్తి, నంద్యాల అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏ.జి.పి) వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకెళ్లామని, మారుతున్న కాలానికి అనుగుణంగా గౌరవ వేతనాన్ని పెంచాలని కోరినట్లు తెలిపారు. వినతి పత్రంపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్ , ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు .

## అల్లరి చేష్టలకు నెల రోజుల జైలు శిక్ష




**బండి ఆత్మకూరు నంది పత్రిక జూలై 30:** చెడు ప్రవర్తన కలిగిన ఒక వ్యక్తికి నంద్యాల మెజిస్ట్రేట్ నెల రోజుల పాటు జైలు శిక్ష విధించారని ఎస్ఐ జగన్మోహన్ గురువారం పేర్కొన్నారు. బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పార్లపల్లి గ్రామానికి చెందిన విజయ వర్ధన రెడ్డి అనే వ్యక్తి తల్లిదండ్రులను తరచుగా ఇబ్బంది పెడుతూ ఉండేవాడని ఎస్ఐ పేర్కొన్నారు. దీనికి తోడు గ్రామంలో చాలామందిని బెదిరిస్తూ, అల్లరిగా తిరుగుతున్న కారణంగా ముద్దాయిని కోర్టులో హాజరుపరచడం జరిగిందని పేర్కొన్నారు. విచారణ అనంతరం నంద్యాల రెండవ తరగతి మెజిస్ట్రేట్ ముద్దాయికి నెల రోజులపాటు జైలు శిక్ష విధించడం జరిగిందని ఎస్ఐ పేర్కొన్నారు.

# జగన్ ఐటీఐ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు.





## నాడు తూ. తూ మంత్రంగా పనులు...నేడు మళ్ళీ అదే సమస్య. మంత్రి కుమారుడు ఎన్.ఏం.డి.ఫిరోజ్ సందర్శించిన అధికారుల్లో మార్పు లేదు. శానిటేషన్,వార్డ్ మేస్త్రి,సిబ్బందికి డబ్బులు ఇస్తాం. శాశ్వత పరిష్కారం చేయాలంటున్న ఆ ప్రాంత ప్రజలు.

**నంద్యాల సిటీ బ్యూరో జులై 30 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలో శానిటేషన్ అధికారుల నిర్లక్షం అంతా ఇంతా కాదు.నంద్యాల పట్టణంలో 42 వార్డుల్లో శానిటేషన్ సమస్య ప్రజలకు శాపంగా మారింది.మున్సిపాలిటీకి కోట్లాది రూపాయలు పన్నులు ప్రజలు చెల్లిస్తున్న ప్రజాసమస్యలు పట్టించుకోవడంలేదు.ప్రజలు కట్టే పన్నులు కేవలం మున్సిపాలిటీలో పనిచేస్తున్న వారికి జీతాల కోసమే ప్రజలు పన్నులు కడుతున్నట్టు అర్థం అవుతుంది.పన్నులు కడతాం,అయినా సమస్యలు పట్టించుకోరు.మా వార్డులో మురుగునీరు రోడ్డుపైకి రాకుండా ఉండేందుకు శావిత పరిష్కారము కు కావాలంటే శానిటేషన్ అధికారి కి, మేస్త్రి,సిబ్బందికి డబ్బులు ఇస్తామని చెప్పడం విశేషం.సాక్షాత్తు మంత్రి ఫరూక్ కుమారుడు ఫిరోజ్ సందర్శించిన కూడా అధికారులు తూ. తూ మంత్రంగా పనులు చేయడంతో మళ్ళీ మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. వివరాల్లోకి వెళితే గత కొద్దిరోజుల క్రితం స్టేట్ బ్యాంక్ కాలనీ నుంచి బాలాజీ కాంప్లెక్స్ వెళ్ళే అడ్డరోడ్డు ,జగన్ ఐటీఐ వద్ద రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో విద్యార్థులు,ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని" నంది పత్రిక" వెలుగులోకి తీసుకొచ్చిన విషయం పాఠకులకు తెలిసిందే.వార్త రావడంతో అక్కడికి మంత్రి ఫరూక్ కుమారుడు ఫిరోజ్ అక్కడికి చేరుకొని శానిటేషన్ అధికారుల కు సమాచారం ఇవ్వడంతో ఎప్పటికప్పుడు జేసీబీ తో కాల్వలో కాసింత పూడికలు తీయడంతో కొద్దిరోజులు ఇబ్బంది లేకుండా పోయింది.గత రెండు రోజులుగా ఇదే సమస్య తలెత్తింది.ఆ ప్రాంత ప్రజలు సచివాలయంలో,మున్సిపాలిటీలో, మేస్త్రి దృష్టికి తీసుకొని పోయినా ఫలితం కనిపించలేదు.మంత్రి కుమారుడు వచ్చినా స్పందించని అధికారులు ఉన్నారని కనీసం మా సమస్య పరిష్కారము డబ్బులు ఖర్చుపెట్టడానికైనా సిద్ధం అంటున్నారు.వాస్తవానికి ఆ ప్రాంతంలో మురుగునీరు సమస్యకు ప్రార్థన కారణం అక్కడ కొందరు స్థలం కబ్జా చేసుకోవటం వల్ల కాల్వ నిర్మాణం చేయలేకపోతున్నారు.వాస్తవానికి నంద్యాల మున్సిపాలిటీలో ప్రతి నెల దాదాపు కోటి 30 లక్షలు శానిటేషన్ అధికారులకు,సిబ్బందికి జీతాలు ఇస్తున్నారు.సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వాలు సచివాలయాలు ఏర్పాటుచేసి అదనంగా అక్కడ పనిచేసేవారికి జీతాలు ఇస్తూ ప్రజలకు భారం మోపుతున్నారు.సచివాలయాల్లో పనిచేసేవారికి ఆ వార్డ్ సమస్యలు తెలియవా,తెలియవు ఎందుకంటే వాళ్ళు జీతాలు తీసుకోవడం తప్ప వార్డుల్లో పనులు చూస్తే కదా తెలిసేది.సచివాలయంలో ఎప్పుడూ చూసినా ఎవరు ఉంటారో ఎవరికి తెలియదు.మరో విచిత్రం ఏమంటే నంద్యాల మున్సిపల్ అధికారులు కాల్వల్లో పూడికలు వేసవి కాలంలో తీయాలని గుర్తు రాదు పాపం,వర్షాకాలం వస్తేనే గుర్తు వస్తుంది.కాల్వల్లో పూడికలు ప్రధాన రహదారులకే పరిమితం చేస్తారు కానీ సందు,గొందుల్లో చేస్తే ఒట్టు.ప్రతి సారి కాల్వల్లో పూడికలక్ లక్షల్లో నిధులు మంజూరు చేస్తారు పనులు మొదలు పెట్టిన కొద్ది రోజులకు వర్షాలు వస్తాయి,పనులు చేయకపోయినా బిల్లులు మాత్రం చేసినట్టు తీసుకుంటారు.తలా పాపం తిలా పిడికెడు అన్నట్టు కాంట్రాక్టర్,అధికారులు అందరూ పంచుకుంటారు.శానిటేషన్ అధికారులు, మేస్త్రి,సిబ్బంది ఇప్పటికైనా వార్డుల్లో పర్యటించి మురుగు కాల్వల నుంచి మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



# లోకేష్ రాజీనామా చేయాలి..

## జగన్ హయాంలోనే పారదర్శక ఉద్యోగాలు

### వైస్సార్సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి మహానంది వినోద్ కుమార్ రెడ్డి




**నంది పత్రిక ప్రతినిధి ఖాజీపేట జూలై 30** వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు కడపలో జరిగిన యువతవిద్యార్థి ర్యాలీకి ఖాజీపేట మండలం నుంచి భారీగా తరలివచ్చిన యువత, విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి మహానంది వినోద్ కుమార్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉద్యోగాల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. టీడీపీ హయాంలో ఒక్క డీఎస్సీతో సుమారు 16 వేల పోస్టులు మాత్రమే భర్తీ చేశారని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో 2.40 లక్షలకు పైగా ఉద్యోగాలను ఎలాంటి సిఫారసులకు తావులేకుండా అర్హత ఆధారంగా భర్తీ చేయడంతో పాటు వాలంటీర్ వ్యవస్థ ద్వారా వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కడప జిల్లా అధ్యక్షుడు పసుపులేటి సాయిదత్త, కమలాపురం నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షుడు సాయికుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## వైయస్సార్ సిపి కడప జిల్లా విశ్వబ్రాహ్మణ మహిళా అధ్యక్షురాలు గా నారాయణమ్మ నిమకం..



**నంది ప్రతినిధి, జూలై 30, వైయస్సార్ కడప జిల్లా..** మన ప్రియతమ నాయకులు వైయస్సార్సీపి అధినేత మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి వారి ఆదేశాల మేరకు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా విశ్వబ్రాహ్మణ అధ్యక్షురాలుగా నారాయణమ్మ నియమించడం జరిగింది. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న నారాయణమ్మ కష్టాన్ని గుర్తించి ఆమెకు ఈ బాధ్యతను అప్పగించినందుకు నాయకత్వానికి ఆమెకు ఈ బాధ్యతను అప్పగించినందుకు న్యాయకత్వానికి ఆమె ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ముఖ్య నేతలకు మర్యాదపూర్వకంగా కలయిక మరియు కృతజ్ఞతలు తన నియమకానికి పూర్తిస్థాయిలో సహకరించినందుకు గాను నారాయణమ్మ నాయకుల క్యాంపు కార్యాలయానికి వెళ్లి సేవలు కప్పి ఘనంగా సత్కరించి తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పి రవీంద్రనాథ్ రెడ్డి కడప జిల్లా అధ్యక్షులు, వైయస్ అవినాష్ రెడ్డి కడప పార్లమెంట్ సభ్యులు, కే సురేష్ బాబు రాష్ట్ర సిఇసి మెంబర్, ఎస్. బి. అంజద్ భాష మాజీ ఉప ముఖ్యమంత్రి వర్యులు, తెలుగు పులి వెంకటసుబ్బమ్మ కడప జిల్లా మహిళా అధ్యక్షురాలు, పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి నిరంతరం చేస్తాను పార్టీ ఏ పిలుపునిచ్చిన నా వంతు శక్తివంతం లేకుండా శ్రమిస్తానని మాట ఇస్తున్నాను.

## మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పరిస్థితిపై స్పందించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్..

### కలెక్టర్ తో కలిసి పరిశీలన, మౌలిక వసతుల కల్పనకు ఆదేశాలు..



**నంది ప్రతినిధి, జూలై 30, వైయస్సార్ కడప జిల్లా.** మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, శిలావస్థకు చేరుకున్న భవనాలు, మౌలిక వసతుల కొరతపై స్పందించిన మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ కళాశాల ఆకస్మికంగా సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. తనిఖీ సందర్భంగా కళాశాల భవనాలు దయనీ పరిస్థితి, తరగతి గదులు, ప్రయోగశాలలు, ప్రాథమిక సౌకర్యాల కొరత ప్రత్యక్షంగా పరిశీలించిన ఎమ్మెల్యే విద్యార్థులు ఇలాంటి పరిస్థితుల విద్యాభ్యాసం కొనసాగించడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఐఏఎస్ వారిని వెంటనే కళాశాలకు ఆహ్వానించి, అక్కడ పరిస్థితులు స్వయంగా పరిశీలించే చర్యలు తీసుకున్నారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ తీసుకొచ్చిన ఎమ్మెల్యే మరియు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అత్యవసరంగా అవసరమైన మౌలిక వసతులు మరియు భవన మరమ్మత్తులు, త్రాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర అన్ని సౌకర్యాలను తక్షణమే కల్పించాలని కోరారు. విద్యార్థులకు న్యాయమైన విద్యతోపాటు సురక్షితమైన, ఆధునిక విద్యావాతవరణాన్ని కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్షమని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. విద్య రంగా అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రధానశిస్తుందని మైదుకూరు నియోజకవర్గం లోని ప్రతి ప్రభుత్వ విద్యాసంస్థలు దశలవారీగా బలవృతం చేసేందుకు అవసరమైన చర్యలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు



## అన్నమలై యూనివర్సిటీ నుంచి పీహెచ్డి పట్ట పొందిన రామక్రిష్ణ



**నంద్యాల ప్రతినిధి. జూలై 30 . (నంది పత్రిక ):** నంద్యాల రాజీవ్ గాంధీ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి చెందిన అధ్యాపకుడు కే రామక్రిష్ణ అన్నమలై యూనివర్సిటీ చిదంబరం నుండి పీహెచ్డి అందుకున్నారు. అన్నమలై యూనివర్సిటీ ప్రధాన అధ్యాపకులు డా. ఎస్ బాలాజీ,మరియు రాజీవ్ గాంధీ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రధాన అధ్యాపకులు డా. ఎమ్ సుధీర్ కుమార్ పర్యవేక్షణలో పరిశోధన నిర్వహించిన ఆయన, 2026 జూలై 15న డాక్టరేట్ సాధించారు. ఆయనా పరిశోధనా సిద్ధాంతం ఎఫెక్టివ్గా ఆఫ్ హెచ్ఆర్ అనలిటిక్స్ టు ఇంప్రూవ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్మెంట్ ప్రాక్టీసెస్ అండ్ ఎంప్లోయే పెర్ఫార్మెన్స్ ఇన్ ఇండియన్ ఐటీఎమ్ఎన్సి అనే అంశంపై పరిశోధన సాగింది. ఈ సందర్భంగా రామ్జిఎమ్ విద్యా సంస్థల ఛైర్మన్ డా. శాంతిరాముడు, మేనేజింగ్ డైరెక్టర్ ఎం శివరాం, కళాశాల ప్రిన్సిపాల్ డా. టీ జయచంద్ర ప్రసాద్, డీన్ డా. అశోక్ కుమార్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి విద్యా, పరిశోధనా రంగాల్లో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## కూటమి ప్రభుత్వం అందిస్తున్న సూపర్ సిక్స్ పథకాలు

### ప్రతి ఒక్కరికి అందాలి. నంద్యాల టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలు కల్లూరీ శకుంతలమ్మ. నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ చింతకుంట్ల బుసిరెడ్డి.



**సిరివెళ్ల ( నంది పత్రిక)** ఆళ్లగడ్డ నియోజకవర్గం సిరివెళ్లమండలం పరిధిలోని కోటపాడు గ్రామంలో ఎమ్మెల్యే అఖిల ప్రియ ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్న నంద్యాల జిల్లా టిడిపి ఉపాధ్యక్షురాలు కల్లూరు శకుంతలమ్మ , నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ చింతకుంట్ల బూసిరెడ్డి ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం , అన్నదాత సుఖీభవ, గ్రామంలో సిసి రోడ్లు కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు వచ్చిన తర్వాత అభివృద్ధి చేసి చూపిచ్చిందని ఆయన అన్నారు. అదేవిధంగా గురువారం నాడు కోటపాడు గ్రామంలో డోర్ టు డోర్ క్యాంపియన్ లో భాగంగా. 71 వ బూత్ పరిధిలో ప్రజలకు సంక్షేమ పథకాల గురించి ప్రభుత్వం చేపడుతున్నఅభివృద్ధి కార్యక్రమాల గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో విజయవంతంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహణ





**శ్రీశైలం జూలై 30 (నంది పత్రిక)** స్వామి వివేకానంద యూత్ ఫౌండేషన్ మరియు కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీశైల దేవస్థానం ఆసుపత్రిలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ శ్రీ పోతుగుంట రమేష్ నాయుడు గారు హాజరై రక్తదానం చేసిన దాతలను అభినందించారు. అనంతరం రక్తదాతలకు పండ్లు,జ్యూస్ పంపిణీ చేసి వారి సేవాభావాన్ని ప్రశంసించారు. ఈ రక్తదాన శిబిరంలో 100 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలందరికీ కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రక్తదాన ధ్రువీకరణ పత్రాలు (సర్టిఫికెట్లు) అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సర్టిఫికెట్ ద్వారా భవిష్యత్తులో ఎక్కడైనా అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైనప్పుడు సంబంధిత నిబంధనల ప్రకారం ప్రయోజనం పొందవచ్చని వివరించారు. స్వామి వివేకానంద యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నాల్గవ స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన రక్తదాతలు, వైద్య సిబ్బంది,దేవస్థానం అధికారులు మరియు స్థానిక ప్రజలకు నిర్వాహకులు మైలపల్లి చెన్నకేశవులు,చదువుల శ్రీను కృతజ్ఞతలు తెలిపారు.



# శ్రీశైలం దేవస్థానంలో శ్రావణమాసం సందర్భంగా

## స్పర్శదర్శనం మరియు ఆర్జితసేవాటికెట్లజారీలో స్వల్పమార్పులు

**ఆగస్టు 13న శ్రావణమాసోత్సవాలు ప్రారంభం**
**సెప్టెంబరు 12వ తేదీన ముగియనున్న**
**శ్రావణమాసోత్సవాలు - శ్రావణమాసం సందర్భంగా**
**ఆన్లైన్ టికెట్ల విధానంలో మార్పులు**

**శ్రీశైలం జూలై 30 (నంది పత్రిక)** ఆగస్టు 13 నుంచి సెప్టెంబరు 12 శ్రావణమాసోత్సాలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంటరమేష్ నాయుడు మరియు కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ శ్రావణమాసంలో భక్తులరద్దీ అధికంగా ఉంటుందన్నారు. రెండు తెలుగురాష్ట్రాల నుంచేకాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, పలు ఉత్తరాది రాష్ట్రాల నుంచి అధికసంఖ్యలో భక్తులు క్షేత్రాన్ని సందర్శిస్తారన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ సామాన్య భక్తుల సౌకర్యార్థం ఆర్జితసేవలు మరియు స్పర్శదర్శనం టికెట్లలో తగు మార్పులు చేయడం జరిగిందన్నారు. భక్తులరద్దీ అధికంగా ఉండే శ్రావణ శుక్ర,శని,ఆది, సోమవారాలలో అనగా మొత్తం 19 రోజుల పాటు అర్జిత అభిషేకములు మరియు ఆర్జిత కుంకుమార్చనలు నిలుపుదల చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ రద్దీరోజులలో ఒక్క విడతలో అనగా రాత్రి గం. 8.30ల స్లాట్ నందు స్వల్పంగా కేవలం 250 స్పర్శదర్శనం టికెట్లు మాత్రమే అందుబాటులో వుంచడం జరిగిందన్నారు. మిగిలిన రోజులలో యథావిధిగా రోజుకు మూడు నిర్థిష్ట సమయాలలో అనగా ఉదయం గం. 7.30లకు మ. గం. 12.30లకు మరియు రాత్రి గం. 9.00ల స్లాట్లలో శ్రీస్వామి స్పర్శదర్శనం టికెట్లను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. రద్దీ తక్కువగా ఉండే రోజులలో ఆర్జిత అభిషేకం, ఆర్జిత కుంకుమార్చన టికెట్లను యథావిధిగా పొందవచ్చునని అన్నారు. భక్తులు ఆయా టికెట్లను సులభంగా పొందేందుకు వీలుగా 80శాతం టికెట్లను మనమిత్ర వాట్సప్ ద్వారా పొందే సదుపాయం కల్పించబడిందన్నారు. అదేవిధంగా దేవస్థానం వెబ్సైట్ ద్వారా మిగిలిన 20 శాతం టికెట్లను భక్తులు పొందవచ్చునని వారు తెలిపారు. పై పరిమితులకు లోబడి మనమిత్ర వాట్సప్ మరియు దేవస్థానం వెబ్సైట్ ద్వారా యథావిధిగా టిక్కెట్లను పొందడంలో ఎటువంటి అంతరాయడం లేదన్నారు. సాంకేతిక సమస్యలు ఉన్నట్లు



వచ్చిన వార్తలలో ఎటువంటి వాస్తవము లేదన్నారు. కావున స్పర్శదర్శనం మరియు ఆర్జితసేవాటికెట్లు పొందగోరే భక్తులు మనమిత్ర వాట్సప్ / ఆన్లైన్ ద్వారా టికెట్లను ముందస్తుగానే పొంది తదనుగుణంగా తమ యాత్రను రూపొందించుకోవాలన్నారు.

# సమస్యలు పరిష్కారం కై కదం తొక్కిన షెడ్యూల్ కార్మికులు






**సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి**
**షెడ్యూల్డ్ కార్మిక వర్గం భారీ ర్యాలీ**
**కలెక్టరేట్ వద్ద నిరసన ధర్నా**

**నంద్యాల ప్రతినిధి. జూలై 30 . (నంది పత్రిక ):** వివిధ రంగాల్లో పని చేస్తున్న షెడ్యూల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఆయా రంగాల్లో ఉత్పత్తిని స్తంభింపజెస్తామని షెడ్యూల్ కార్మికులు హెచ్చరించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, తదితర డిమాండ్లతో కార్మికులు నంద్యాల లో పెద్ద ఎత్తున కోవెలకుంట్ల -నూనేపల్లి జంక్షన్ నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ధర్నాకు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి. ఏసురత్నం అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమం లో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. నాగరాజు మాట్లాడుతూ కార్మిక వర్గం లేకుండా ప్రభుత్వాలు నడవలేవని వారు పని చేయకుంటే ఉత్పత్తి ఆగిపోతుందని హెచ్చరించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరచి షెడ్యూల్ కార్మికుల సమస్యల పై వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎన్నో ఏళ్లుగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న షెడ్యూల్ కార్మికుల జీవితాలు అగోమ్య గోచరంగా మారాయన్నారు. బజారు హమాలీలు, వెర్ హౌస్ లలోనూ, షాపింగ్ మాల్ లలో ను, మున్సిపాలిటీ, గ్రామ పంచాయితీ లలో పని చేసే కార్మికులు, గనుల్లో పనిచేసే కార్మికులకు చేస్తున్న పనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు ఎందుకు పెంచడం లేదో సమాధానం చెప్పాలన్నారు.. పనులు చేస్తున్నాం. ప్రభుత్వాలను మారుస్తున్నాం.. కానీ వచ్చిన పాలకులు కార్మికుల సంక్షేమం గురించి ఆలోచించడం లేదన్నారు. కేవలం బడా, కార్పొరేట్ సంస్థలకోసం పాలకులు పని చేస్తున్నారన్నారని ఘాటు విమర్శలు చేశారు.. కార్మిక వర్గం పోరాటాల వైపు రాకుండా నిర్భందాలు విధించడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కు మంచింది కాదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తే రోడ్ల మీదకు కార్మికులు ఎందుకు వస్తారని ప్రశ్నించారు. జీతాలు పెంచమంటే జీవోలు ఉన్నాయా అని అడుగుతున్నారని, కానీ ఎమ్మెల్యే లకు లక్షల వేతనాలు అఘామేఘాల మీద పెంచడం న్యాయంగా ఉందా అని ప్రశ్నించారు. కనీస వేతనాలు 26 వేలు యజమానులు కానీ, ప్రభుత్వాలు ఇవ్వడం లేదని నాగరాజు విమర్శించారు. ఏళ్ల తరబడి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగుల కనీస వేతనాలు 26 వేలకు పెంచమని అడుగుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. రాష్టంలోని అన్ని షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్లలో అవసరాధారిత కనీస వేతనాలను తక్షణమే ప్రకటించి అమలు చేయాలని కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్ లను తక్షణం రద్దు చేయాలని,రాష్ట్రవేతన బోర్డు ను వెంటనే ఏర్పాటు చేసి, వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా క్రమం తప్పకుండా వేతనాలను సవరించాలని ప్రతి కార్మికుడికి సమగ్ర పమాదబీమా సౌకర్యం కల్పించాలి. అర్హత కలిగిన ప్రతి కార్మికుడికి పీఎఫ్, ఈఎస్ఐ మరియు ఇతర సామాజిక భదతా పథకాలను తప్పనిసరిగా అమలుచేయాలని, కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి మరియు అసం ఘటిత రంగ కార్మికులకు కూడా సమాన కార్మిక హక్కులు, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని , 1952, ఈఎస్ఐ , 1948 మరియు ఇతర కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేయాలని,కనీస వేతనాలు చెల్లించని, పీఎఫ్ఈఎస్ఐ అమలు చేయని యాజమాన్యాలపైకఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల పతినిధులతో చర్చలు జరిపి కార్మిక సంక్షేమానికి సమగ్ర కార్యాచరణ పణాళిక రూపొందించాలని,విజయ పాలడైరిఇతర సొసైటీ, కార్పొరేషన్ ల లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి అక్రమ తొలగింపుల్లో ఆపాలని,యూనివర్సిటీ పరిశోధన కేంద్రం కళాశాల గురుకులాల్లో పని చేసే కాంట్రాక్ట్ & ఔట్సో ర్సింగ్ అన్ని కేటగిరీల ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అందిస్తూ దశలవారీగా రెగ్యులర్ చేయాలి.



ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శులు లక్ష్మణ్, బాల వెంకట్, పి వెంకట్ లింగం,రామ్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు కే మహమ్మద్ గౌస్, శివరాం జిల్లా నాయకులు రణధీర్, రత్నమయ్య, మారెన్న, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు బాలదుర్గ,భాస్కరాచారి రంగనాథ్, గ్రామపంచా యతీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు వీఆర్ఏ సంఘం జిల్లా నాయకులు శివరామకృష్ణ, బాలు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా నాయకులు మండల శ్రీనివాసులు గడ్డం యాకోబు 108 శేషయ్య 102 నాయకులు సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా నాయకులు సి ఆర్ పి హిమ శేఖర్ ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ ఇధాయతుల్లా, రామకృష్ణ రాఘవేంద్ర ఆర్ ఏఆర్ఎస్ అయ్యన్న, పుల్లయ్య, వీరితోపాటు వేలాదిమంది కార్మికులు పాల్గొనడం జరిగింది.

# బి కోడూరులో శక్తి టీం అవగాహన సదస్సు




**బండి ఆత్మకూరు నంది పత్రిక జూలై 30:** విద్యార్థులు చెడు అలవాట్లకు గురికాకుండా సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని నంద్యాల శక్తి టీం బృందం విజ్ఞప్తి చేసింది. నంద్యాల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ ఉత్తర్వుల మేరకు నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు మహిళా కానిస్టేబుల్ లక్ష్మీదేవి బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న బి కోడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం శక్తి యాప్ పై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. శక్తి యాప్ నెంబరు 7993485111 విద్యార్థిని విద్యార్థులకు తెలిపి, ఫేక్ యాప్స్, మెసేజ్లు వచ్చిన వాటిని ఓపెన్ చేయరాదని సూచించారు. ఫేక్ మెసేజ్లు ఓపెన్ చేయడం వల్ల వచ్చే ఆర్థిక నష్టాలను గురించి విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. చిన్నపిల్లలపై అత్యాచారాలు జరిగిన, బాల్య వివాహాలు జరిగిన టోల్ ఫ్రీ నెంబర్ 10 98 కి ఫోన్ చేయాలని సూచించారు. అమ్మాయిలు, మహిళలు ఆపద సమయంలో ఉన్నప్పుడు శక్తి యాప్ నంబర్ కు వీడియో కాల్ కానీ, నార్మల్ కాల్ కానీ చేస్తే పోలీస్ శాఖ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అమ్మాయిల పట్ల ఎవరైనా చెడుగా ప్రవర్తిస్తే,ఈవ్ టీజింగ్, ర్యాగింగ్లు చేస్తే, 112,100 ఫోన్ చేస్తే కూడా పోలీస్ శాఖ వెంటనే స్పందిస్తుందని అన్నారు. విద్యార్థినిలు ఇంటికి వెళ్లిన తర్వాత తమ తల్లిదండ్రుల మొబైల్ నందు శక్తి యాప్ డౌన్లోడ్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి మహిళ, శక్తి యాప్ను నమోదు చేసుకోవాలని, యాప్ మహిళలకు రక్షణ కవచంగా ఉంటుందని, మహిళల భద్రతే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తుందని పేర్కొంటూ విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు.



# కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచార పోరుబాట

### ఆగష్టు 17న కలెక్టరేట్ ముట్టడి

### సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమం

**నంద్యాల ప్రతినిధి. జూలై 30 . (నంది పత్రిక ):** రాష్ట్రంలో తీవ్రమైన ఎల్ నినో ప్రభావంతో కరువు కోరల్లో చిక్కుకున్న నంద్యాల జిల్లా రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని, జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులకు అవగాహన కార్యక్రమాలు, ఉపశమన చర్యలు చేపట్టాలని సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు తీవ్ర స్థాయిలో డిమాండ్ చేశారు. గురువారం నంద్యాల పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగనాయుడు మాట్లాడుతూ... జిల్లాలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, గడివేముల, మిడుతూరు, కొత్తపల్లి, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు అల్లాడిపోతున్నారన్నారు. వర్షాభావం దృష్ట్యా ఖరీఫ్ సీజన్ గడువును సెప్టెంబర్ ఆఖరు వరకు పొడిగించాలని కోరారు. ఉమ్మడి జిల్లా పరిధిలోనే పంటల బీమా ప్రీమియంలో తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయని మండిపడ్డారు. కర్నూలు జిల్లాలో పంటల బీమా ప్రీమియం ఎకరాకు రూ. 44 గా ఉంటే, నంద్యాల జిల్లాలో మాత్రం రూ. 450 గా అధికారులు చెప్పడం ఏంటని నిలదీశారు. ఈ తారతమ్యాలను వెంటనే సరిదిద్దాలన్నారు. ఉపాధి లేక నలిగిపోతున్న వ్యవసాయ కూలీలకు పనులు కల్పించాలని, లేకపోతే ప్రత్యామ్నాయ మార్గాలు చూపించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంటలకు, తాగునీటికి ఆధారమైన అలగనూరు రిజర్వాయర్ గండిని 2017లో పరిశీలించి రూ. 31 కోట్లతో అంచనాలు వేశారని, ప్రస్తుత కలెక్టర్ పరిశీలించి రెండేళ్లు కావస్తున్నా ఆ గండిని పూడ్చకపోవడం దారుణమన్నారు. డోన్ ప్రాంతానికి హంద్రీనీవా ద్వారా చెరువులు నింపుతామని, రూ. 382 కోట్ల వ్యయంతో పైలట్ ప్రాజెక్ట్ చేపడతామని చెప్పిన ప్రభుత్వం నేటికీ ఆ పనులను నెరవేర్చకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తల్లడిల్లుతున్నారన్నారు. నందికొట్కూరు పట్టణానికి తాగునీరు అందక ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బనగానపల్లె నియోజకవర్గంలో సిమెంట్ ఫ్యాక్టరీల కోసం, అల్ట్రాటెక్, పవర్ గ్రిడ్ కంపెనీల పేరుతో రైతుల నుంచి వేలాది ఎకరాలను బలవంతంగా సేకరించి తగిన నష్టపరిహారం చెల్లించలేదని ఆరోపించారు. పాణ్యం, గడివేముల మండలాల్లో గ్రీన్ కో ప్రాజెక్టు కింద వేలాది ఎకరాలు లాక్కుని, స్థానిక నిరుద్యోగ యువతకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో పేదల భూములను అభివృద్ధి పేరిట లాక్కున్నారని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన ఒక సెంటు స్థలం సరిపోదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షల ఆర్థిక సాయం ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని గుర్తు చేశారు. నంద్యాల పట్టణంలో నేటికీ పేదలకు ఒక్క సెంటు స్థలం కూడా ఇవ్వలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఫరూక్ వద్దకు వెళ్లి అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చామని, ఇకపై అర్జీలు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై సిపిఐ ఆధ్వర్యంలో సమరభేరి మోగిస్తున్నట్లు రంగనాయుడు వెల్లడించారు. ఆగస్టు 6 నుండి 15 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యలపై పాదయాత్రలు, ప్రచార ఆందోళనలు నిర్వహిస్తామని, తమ పాదయాత్రను అలగనూరు రిజర్వాయర్ నుంచే ప్రారంభిస్తామన్నారు. ఈ క్రమంలోనే ఆగస్టు 17న నంద్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆ తర్వాత ఆగస్టు 18 నుండి 25 వరకు సిపిఐ అనుబంధ ప్రజా సంఘాలైన మహిళా సమాఖ్య, వ్యవసాయ కార్మిక సంఘం, యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విస్తృత అవగాహన, ప్రచార కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రభుత్వం ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించని పక్షంలో సెప్టెంబర్ 1న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో 'చలో ఢిల్లీ' ధర్నా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా కార్యదర్శి సోమన్న, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.




# జీవితం పైనపటారం లోన లోటారం



జీవితం అందంగా ఆనందంగా ఉండదు జీవితం సమస్యలవలయం నిత్య పోరాటాలయజ్ఞం ఆందోళనల పథం మరిచిపోలేని మనుషులు మరుద్దామన్న మరిచి పోలేనిమనుషుల మాటలు వదులుకోలేనిబంధాలుజీవితంలోఅంతర్భాగాలు అహంకారం అహంభావం స్వార్ధపరత్వం మనిషి పతనానికి రహదారులుఎదిగిన కొద్దీ ఒదిగి ఉండాలిఓర్పు నేర్పు సహనం సమన్వయంసంఘీబావం అవగాహన మనిషి జీవన శైలి కావాలి.జీవితంలో భాదలుమనకుగుణపాఠం కావాలి.ప్రతి గుణపాఠం మనలో

**మార్పుకు బాట కావాలి.అనుభవాలు మనలో** ఆత్మవిశ్వాసాన్ని పెంచాలి.మనిషిగా జన్మించడం అద్భుతం జీవితంలో ఎంతో మందిని కలవడం సహజం ఆరోగ్యంగా ఉండశీ అదృష్టం మనిషి జీవన పయనంలోకలిసే వారు వదిలి వెళ్ళేవారు ఎందరోఎవ్వరు శాశ్వతంగానీతో ఉండరు ఎవరికి వారే యుమునా తీరే నీవు పుట్టినపుడు ఒకడివేపోయేటపుడు ఒకడివే ఈ జీవన నాటకంలో అందరం పాత్రధారులమే ముడి వడుతున్న భంధాలన్నీ వరాలే ఎదురవుతున్న అడ్డంకులు అన్ని జీవితంలో విలువైన పాఠాలే అతి ఆలోచన మానుకోఆందోళన వదులుకో ఉన్నంతలో అనందంగా గడుపడమే జీవితంసంపదలు లేకపోయిన సంస్కారం ఉండాలి.మమత మానవీయత ఆర్ధత అవగాహన సౌహార్ధత సహనం సమన్వయంతోజీవితాన్ని ఎంజాయ్ చేయాలి.సంస్కారం లేని జీవితం వ్యర్థం తెడ్డులేని పడవ లాంటిది

**జీవితం అంటే త్యాగాలు– బాధ్యతలు మాత్రమే కాదు – ఇతరుల పట్ల ప్రేమసాటివారి** పట్ల దయ ఉండాలి.హానిచేయని మనస్తత్వం చిరునవ్వుతో పలకరింపు మన జీవన శైలి అవుతే అంతకు మించిన ఆనందం అదృష్టం ఇంకేమీ ఉండదు.ఆప్యాయత ఆత్మీయతమన సంపద అవుతే అందరి అభిమానానికి అడ్రస్ అవుతాం.ఆత్మీయతను పంచుదాం.అందరినీ ఆదరిద్దాం నేదునూరి కనకయ్య అధ్యక్షులుతెలంగాణ ఎకనామిక్ ఫోరమ్ సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరంతెలంగాణ వికాస వేదిక కరీంనగర్.

# పంట బీమాకు నేడే చివరి రోజు

### సమగ్ర పోషక యాజమాన్యంపై సూచనలు

**బండి ఆత్మకూరు నంది పత్రిక జూలై 30:** బండి ఆత్మకూరు స్థానిక ఏఓ కార్యాలయం నందు వ్యవసాయ శాఖ మరియు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం నంద్యాల ఎల్ నైనో పరిస్థితుల్లో రైతులు చేపట్టాల్సిన చర్యలు పంటల వారీగా సమగ్ర పోషక యాజమాన్య సూచనలను పంట ప్రణాళికను మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ విడుదల చేశారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ మంజునాథ్, డాక్టర్ రవి ప్రకాష్ రెడ్డి డాక్టర్ చైతన్య మరియు డాక్టర్ వి జయలక్ష్మి బండి ఆత్మకూరు మండలానికి ఎల్ నైనో పరిస్థితుల్లో పంట ప్రణాళికను సిఫారసు చేశారని, పంటల్లో నేల పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం, సిఫారసు చేసిన మోతాదులో నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలని అధికారులు సూచించారు. అలాగే జింక్ సల్ఫేట్, 19:19:19 వంటి సూక్ష్మ పోషకాలను అవసరానికి అనుగుణంగా వినియోగించాలని తెలిపారు. వరిలో కీలక దశల్లో యూరియా, పొటాష్ ఎరువులను విడతల వారీగా వేయడంతో పాటు నీటి యాజమాన్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మొక్కజొన్నలో విత్తిన వెంటనే కలుపు నివారణ, ఎరువుల సరైన వినియోగం, నాటిన 2025 రోజులలో పైపొట్టు ఎరువులు వేయాలని పేర్కొన్నారు. మినుము విత్తే ముందు విత్తన శుద్ధి చేసి, సిఫారసు చేసిన ఎరువులు, సూక్ష్మ పోషకాలను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని, రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల సూచనలను పాటించాలని కోరారు.

**సోయాబీన్:** ఆరుతడి క్రింద పూత మరియు కాయ ఏర్పడే కీలక దశలలో రక్షక తడిని సూక్ష్మ నీటి పారుదల పద్ధతి ద్వారా అందించాలి. పొటాషియం నైట్రేట్ 5 గ్రా/లీటరు నీటికి (లేదా) యూరియా 20 గ్రా/లీటరు నీటికి (లేదా) 19:19:19 5 గ్రా/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**వరి:** బెట్ట పరిస్థితుల్లో వరి నారు మడులలో జింక్ మరియు ఐరన్ పోషక లోపాలు కనిపించిన వెంటనే జింక్ లోప నివారణకి జింక్ సల్ఫేట్ 20 గ్రా./లీ. మరియు ఐరన్ లోప నివారణకు 20 గ్రా. అన్నభేది +2 గ్రా నిమ్మ ఉప్పు చొప్పున కలుపుకొని పిచికారి చేసుకోవాలి. వరి నారు ను ఆలస్యంగా (30–35 రోజులప్పుడు) నాటుకున్నట్లైతే 25% అదనపు నత్రజని ని వేసుకోవాలి (20–25 కె.జి/ఎకరానికి) మూన తిరిగిన రోజు నుండి పైరు దుబ్బు చేయటం పూర్తి అయ్యేవరకు పొలంలో పలుచగా అంటే 2–3 సెం.మీ. వరకు నీళ్ళు పెట్టుకోవాలి

**మొక్కజొన్న:** నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో బోదెలు మరియు కాలువలు పద్ధతిలో నీటి తడులు ఇవ్వాలి.నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో ఒక వరుస మార్చి వరుస పద్ధతిలో నీటి తడులు ఇవ్వాలి.ఆరుతడి క్రింద పూతకి ముందు, పూత దశ మరియు గింజ పాలు పోసుకునే దశలలో రక్షక తడిని సూక్ష్మ నీటి పారుదల పద్ధతి ద్వారా అందించాలి. పొటాషియం నైట్రేట్ 5 గ్రా/లీటరు నీటికి (లేదా) యూరియా 20 గ్రా/లీటరు నీటికి (లేదా) 19:19:19,5 గ్రా/లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. నేలలో తేమ నిల్వ ఉండేందుకు రెండు నుంచి మూడు సార్లు అంతర కృషి చేయాలి.

**మినుము :** ఆరుతడి క్రింద, పూత మరియు కాయ ఏర్పడే కీలక దశలలో రక్షక తడిని సూక్ష్మ నీటి పారుదల పద్ధతి ద్వారా అందించాలి. పొటాషియం నైట్రేట్, 5 గ్రా/లీటరు నీటికి (లేదా) యూరియా 20 గ్రా/లీటరు నీటికి (లేదా) 19:19:19, 5 గ్రా/లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

**పీఎం కిసాన్ కొరకు ఈకేవైసీ తప్పనిసరి**



**పంట బీమాకు చివరి రోజు**

**ఏఓ పవన్ కుమార్..** పీఎం కిసాన్ పథకం కింద రైతులకు డిబిటి ద్వారా ఆర్థిక సహాయం ఇప్పటికే 23 విడుదల విడుదల అయ్యాయని, ఈ ఏడాది 2026నకు ఆగస్టు–నవంబర్ న 24వ విడత నిధులు సకాలంలో అందించేందుకు పీఎం కిసాన్ లబ్ధిదారులు ప్రతి ఒక్కరు ఈకేవైసి తప్పనిసరిగా చేసుకోవాలని ఏఓ తెలిపారు. సిఎస్సి మీసేవ కేంద్రాల్లో బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా లేదా పిఎం కిసాన్ మొబైల్ యాప్ లో ఫేషియల్ ద్వారా రైతులు ఈకేవైసి చేసుకోవచ్చని, నిజమైన అర్హులైన రైతులకు మాత్రమే ప్రయోజనం అందించేందుకు ప్రతి సంవత్సరం ఈకేవైసి తప్పనిసరి అని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని వారు తెలిపారు. అలాగే వివిధ పంటలు సాగు చేసిన రైతులు పంట బీమా చేసుకోవడానికి జూలై 31న చివరి రోజు అని, కేవలం వరి పంటకు మాత్రమే ఆగస్టు 15 వరకు అవకాశం ఉందని, రైతులు వెంటనే మీ సేవలో లేదా రుణం పొందిన బ్యాంకుల్లో ప్రీమియం చెల్లించి పంట బీమా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఏఓ కోరారు. మరింత సమాచారం కొరకు స్థానిక రైతు సేవ కేంద్ర సిబ్బంది లేదా మండల వ్యవసాయ అధికారి కార్యాలయం నందు సంప్రదించాలని వారు తెలిపారు.

# ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్న టీడీపీ నాయకులు



**వెలుగోడు, జూలై 30 (నంది పత్రిక):** తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వెలుగోడు పట్టణంలో "అభివృద్ధి సంక్షేమం" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాల మేరకు 98, 111 బూత్‌ల పరిధిలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి (ఉచిత బస్సు ప్రయాణం) వంటి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే ఈ పథకాల లబ్ధి ప్రజలకు సక్రమంగా అందుతోందా అనే విషయాన్ని తెలుసుకున్నారు.నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ ఖలీల్ ఖాన్, సొసైటీ చైర్మన్ మండ్ల శంకర్ రెడ్డి, బూత్ కన్వీనర్లు చమన్, ప్రసాద్, కాజా, ముజీబ్‌తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# శ్రీశైలం దేవస్థానంలో సిబ్బందికి దుస్తుల పంపిణీ



**శ్రీశైలం జూలై 30 (నంది పత్రిక)** ( 30.07.2026) శ్రీమతి మాధురి చౌదరి, విజయవాడ వారు ఆలయం నందు విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య మరియు గోశాల సిబ్బందికి దుస్తులను పంపిణీ చేయవలసినదిగా కోరుతూ 300లకు పైగా దుస్తులను దేవస్థానానికి పంపించడం జరిగింది. వీటిని కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయములో ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు ఈ రోజు గోశాలలో పని చేస్తున్న సిబ్బందికి మరియు ఆలయ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు మాట్లాడుతూ శ్రీమతి మాధురి చౌదరి వారు సిబ్బందికి దుస్తులను పంపడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ దుస్తులు అందజేసిన దాతకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములు, పర్యవేక్షకులు డి. మల్లికార్జునుడు తదితర సిబ్బంది పాల్గొన్నారు.



# వర్షాలు కురవాలని అబ్దుల్లాపురంలో ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు



**వెలుగోడు (నందిపత్రిక):** సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ వెలుగోడు మండలం అబ్దుల్లాపురం గ్రామంలో క్రైస్తవ సోదరులు బుధవారం ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు.గ్రామంలోని వ్యవసాయ పొలాల్లో సీఎస్ఐ చర్చి పాస్టర్ ఇమ్మానుయేలు ఆధ్వర్యంలో ఈ ప్రార్థనా కార్యక్రమం జరిగింది. ప్రార్థనల్లో పాల్గొన్న గ్రామస్తులు, క్రైస్తవ సంఘ సభ్యులు ప్రకృతి అనుకూలించాలని దేవుడిని వేడుకున్నారు. వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి చెరువులు, కుంటలు నిండాలని, రైతులు సాగు చేసిన పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామం సుఖశాంతులతో విలసిల్లాలని ప్రత్యేక విన్నపాలు చేశారు. ఈ ప్రార్థనా కార్యక్రమంలో సంఘ పెద్దలు రమణయ్య, దానమయ్య, గొంటెముక్కల శివమ్మ, సుధాకర్, దిబ్బన్న, సాయిబాబ, రమేష్, రత్నమయ్యలతో పాటు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పీఎం ఫసల్ బీమా యోజన రైతన్నకు ధీమ : సొసైటీ చైర్మన్ లు

**శిరివెళ్ల :(నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని బోయలకుంట్ల శిరివెళ్ల సొసైటీ ల పరిధిలో ఉన్నటువంటి పిఎసిఎస్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సొసైటీ పరిధిలో గల రైతులు ప్రస్తుతం సాగు చేసిన పంటలకు ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోయలకుంట్ల సొసైటీ చైర్మన్ కాటంరెడ్డి అరుణమ్మ, సీఈఓ కానాల దస్తగిరి, శిరివెళ్ల సహకార సంఘ సొసైటీ చైర్మన్ కొండమడుగుల శ్రీనివాసరెడ్డి సీఈవో ఎం మహబూబ్ బేగ్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఎల్ నీ నో ప్రభావం కారణంగా రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యి పంటల సాగు తగ్గే ప్రమాదం పొంచి ఉన్నందున శిరివెళ్ల సొసైటీ పరిధిలోని రైతన్నలు తగిన జాగ్రత్త వహించి పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సొసైటీ ల పరిధిలో మినుము మొక్కజొన్న వరి ఇతర పంటలు సాగు చేసీ ఉంటే వెంటనే శిరివెళ్ల కేంద్ర సహకార సంఘ బ్యాంకులో గాని సొసైటీలో గాని పంటల బీమాను చెల్లించి ధీమాగా ఉండవచ్చని పిలుపునిచ్చారు. రైతన్నలు ఇదివరకే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం చేసుకొని ఉంటే అక్నాలెడ్జ్మెంట్ రసీదులు సొసైటీలో అందించాల్సిన అవసరం ఉందన్నారు.



# పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు.

### టాపర్స్‌కు ఘన సన్మానం.

### పేద విద్యార్థులకు రూ.1.35 లక్షల స్కాలర్షిప్.



**వెలుగోడు, జులై 30 నంది పత్రిక :** పేద విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో "విద్యార్థి ప్రోత్సాహక అభినందన సభ" గురువారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందు పాఠశాల ఆవరణలోని సరస్వతి, ఫాతిమాబీ, మహాత్మా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పిన కీర్తిశేషులైన గురువులు మరియు విద్యార్థుల స్మృతికి 2 నిమిషాల పాటుమౌనంపాటించారు.ప్రతిభను గుర్తించి ప్రభుత్వ, ప్రైవేట్ టాపర్స్ సత్కారం. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల 10వ తరగతి టాపర్స్‌ను పూలమాలలు, శాలువలు మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రతిభ చాటిన పేద విద్యార్థులకు మొత్తం రూ.1 లక్ష 35 వేల నగదు ప్రోత్సాహకం, స్కాలర్షిప్‌లుఅందజేశారుఇందులో 15 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.6000, 6 మందికి రూ.5000 చొప్పున, మూడు వేల రూపాయల చొప్పున ఒకరికి, 6 మందికి రూ.1500 చొప్పున, 1 మందికి రూ.1000 చొప్పున అందజేశారు ఈ కార్యక్రమంలో ఎన్నం సుధాకర్ రెడ్డి దంపతులకు, సి ఎ పూర్తి చేసిన తాళ్లూరి శ్యామ్‌కు పూర్వ విద్యార్థుల సంఘం ఘనంగా సన్మానం చేసింది. పేద విద్యార్థులకు చేయూతనిచ్చిన పూర్వ విద్యార్థుల సంఘం సేవలను పలువురు అభినందించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, పూర్వ విద్యార్థుల సంఘం అందిస్తున్న ప్రోత్సాహం ఇతరులకు ఆదర్శమని కొనియాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పూర్వ విద్యార్థుల సేవలు మన వెలుగోడు పట్టణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉండడం మనందరి అదృష్టం అన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం మాలిక్ ఖాన్ ఇన్చార్జి హెచ్ఎం మొయినుద్దీన్, మాజీ సర్పంచ్ వేల్పుల జైపాల్ రెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు జి. రామలింగారెడ్డి, మక్బుల్ బాషా, వై. సుధాకర్ రెడ్డి, జయరామిరెడ్డి, నసురుల్లా ఖాన్, శ్రీకాంత్ రెడ్డి, సుల్తాన్ మొహిద్దీన్, జె రఫిక్ అహ్మద్, నారాయణ, శ్రీరాములు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, హెచ్ఎంలు డాక్టర్ ఎం ఎఫ్ ఇమ్మానియేల్, అతావుల్లా, నరసింహులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గార్లదిన్నె - అలేబాద్ వాటర్ గ్రిడ్ పంప్‌హౌస్‌ను పరిశీలించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి



**నందిపత్రిక -ప్యాపిలి** ప్యాపిలి మండలంలోని గార్లదిన్నె గ్రామం నుంచి అలేబాద్ గ్రామానికి మంచినీటిని సరఫరా చేస్తున్న వాటర్ గ్రిడ్ పంప్‌హౌస్‌ను డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ కేంద్ర మంత్రి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పంపిణీ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందో లేదో తెలుసుకునేందుకు ఆయన ఈ తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పంప్‌హౌస్‌లోని మోటార్లు, నీటి నిల్వ ట్యాంకులు, ఫిల్ట్రేషన్ యూనిట్లను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, పనితీరుపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ గార్లదిన్నె నుంచి అలేబాద్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు నీటి సరఫరాలో ఎలాంటి సాంకేతిక అంతరాయాలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని నిరంతరం నాణ్యమైన, సురక్షితమైన తాగునీటిని మాత్రమే అందించాలని ఆదేశించారు.పైప్‌లైన్ లీకేజీలు మోటార్ల మరమ్మతులు ఉన్నట్లయితే నిర్లక్ష్యం వహించకుండా వెంటనే పునరుద్ధరించాలని స్పష్టం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత లేకుండా చూడటమే కూటమి ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశమని, ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ఏమాత్రం రాజీ పడేది లేదని కోట్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సీమ సుధాకర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు సుదర్శన్, నేరెడుచెర్ల వెంకటేష్, సతీష్ పాల్గొన్నారు.



## పంటల బీమా తప్పనిసరి

**వెలుగోడు జూలై 30 నంది పత్రిక:** క్రాప్ లోన్ల కింద పంట రుణాలు తీసుకున్న రైతులు తాము సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా పంట బీమా చేయించుకోవాలని రేగడగూడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సీఈవో కృష్ణమోహన్ సూచించారు. రేగడగూడూరు సహకార సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పంట రుణాలు పొందిన రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద తమ పంటలను తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని తెలిపారు. రైతులు తమకు సమీపంలోని డీసీసీబీ బ్రాంచ్ లేదా పీఏసీఎస్ కార్యాలయాన్ని సంప్రదించి పంట బీమా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ఇప్పటికే పంట బీమా చేయించుకున్న రైతులు సంబంధిత అక్నాలెడ్జ్‌మెంట్‌ను పీఏసీఎస్ సీఈవోకు సమర్పించాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే పంట నష్టాల నుంచి ఆర్థిక రక్షణ పొందేందుకు రైతులు నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోగా పంట బీమా నమోదు పూర్తి చేసుకోవాలని కృష్ణమోహన్ కోరారు.

## కంగనాకు అంత కోపం పనికిరాదు

భాజపా ఎంపీ, నటి కంగనా రనౌత్ తనపై చేసిన విమర్శలపై కాక్రోజ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ ఘాటుగా స్పందించారు. తనను పనికిరాని వాడు, నిరుద్యోగి అని పిలవడాన్ని తప్పుపట్టారు. గూగుల్‌లో సెర్చ్ చేస్తే ఇలాంటి తప్పుడు సమాచారమే వస్తుందని అన్నారు. ఓ ఇంటర్వ్యూలో సౌరవ్ మాట్లాడుతూ.. ఆమె ఈ దేశ భవిష్యత్ తరాలను, యువతను తీవ్రంగా విమర్శిస్తున్నారని అన్నారు. కంగనా నా వ్యాఖ్యలపై ఎందుకు అంతగా స్పందించారో అర్థం కావడం లేదు. ఇదే మాట నా స్నేహితులు కూడా అంటున్నారు. 'ఆమెకు నువ్వు చిన్నప్పటి హృతిక్ రోషన్ లాగా కనిపిస్తున్నావేమో' అని నా ఫ్రెండ్ మెసేజ్ చేశాడు. అది నిజమేనా? నా స్నేహితులు ఇలా అనడంతో నేను చాలా ఆశ్చర్యపోయాను అని వ్యంగ్యంగా సమాధానమిచ్చారు.

# సున్నిపెంటలో ఈనెల 31న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణ



**నంద్యాల జిల్లా శ్రీశైలం, జులై 30 :-(నంది పత్రిక)** జిల్లా పరిపాలన ప్రజలకు మరింత చేరువ కావడం, స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడం లక్ష్యంగా చేపట్టిన "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 31వ తేదీన శ్రీశైలం నియోజకవర్గంలోని సున్నిపెంటలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణవేణి (రెడ్డివారి) కల్యాణ మండపంలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, సంబంధిత శాఖల ద్వారా తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల సమస్యలను నేరుగా పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గ పరిధిలోని శ్రీశైల మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విజ్ఞప్తి చేశారు.

## భారతీయ జనతా పార్టీ ప్రజలకు అందుబాటులో ఉంటారు ,,

### జిల్లా జనరల్ సెక్రెటరీ మాలతి ,,,,



**ఎమ్మిగనూరు నంది పత్రిక జూలై 30** ఎమ్మిగనూరు నియోజకవర్గ అసెంబ్లీ కార్యాలయాన్ని కర్నూలు జిల్లా జనరల్ సెక్రెటరీ గొందిపల్లె మాలతి సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు, నియోజకవర్గంలో చేపట్టాల్సిన సంస్థాగత బలోపేత చర్యలు, ప్రజా సమస్యలపై భారతీయ జనతా పార్టీ కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి గురురాజ్ దేశాయ్ తో మరియు బిజెపి నాయకులతో చర్చించారు... ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బి ఎల్ నారాయణ , నందవరం మండలం మాజీ సర్పంచ్ రామన్న గౌడ్, మహిళా మోర్చా కర్నూలు జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మావతి ఎమ్మిగనూరు పట్టణ ఉపాధ్యక్షులు గాజుల సురేంద్ర, కిషన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గద్వాల రవి నాయుడు బిజెపి నందవరం మండలం ఎస్సీ మోర్చా అధ్యక్షులు కల్లెల శివ బిజెపి నాయకులు రంగస్వామి, మరియు బిజెపి కార్యకర్తలు సోషల్ మీడియా కన్వీనర్ వాల్మీకి దండు వీరేష్ పాల్గొన్నారు

## వేధింపులకు గురిచేసే ఫైనాన్స్ సిబ్బంది ఆగడాలను అరికట్టాలి : పిక్కిలి వెంకటేశ్వర్లు.




**నందికొట్కూరు జులై 30(నంది పత్రిక )** నందికొట్కూరులో వడ్డీ వ్యాపారాలు, డైలీ ఫైనాన్స్, ఈఎంఐ రుణాల వసూళ్లలో చట్టవిరుద్ధమైన ఒత్తిళ్లు, వేధింపులను అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యంకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నాలుగు మండలాల పరిధిలోని ప్రైవేట్ ఫైనాన్స్, బ్యాంకుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, రుణగ్రహీతలపై చట్టవిరుద్ధమైన ఒత్తిళ్లు, బెదిరింపులు చేయరాదని స్పష్టమైన సూచనలు ఇస్తామని తెలిపారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మల్యాల గ్రామంలో జరిగిన విషాద ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కాటేపోగు సోమన్న, వడ్డే సుధాకర్, ఎస్. షరీఫ్, మాధవనాయుడు, ఎం. చంద్రశేఖర్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. బేబీ, అధ్యక్షురాలు బి. లక్ష్మీదేవి, వి. రేణుక, వెంకటలక్ష్మమ్మ, వి. మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు

## "సున్ని మస్జీద్ & ఈద్గా ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేసిన ఎన్ .ఎం.డి .ఫిరోజ్"

**నంద్యాల సిటీ బ్యూరో జులై 30 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని శాంతిరామ్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న సున్ని మస్జీద్ & ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రహరీ గోడ నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ , మంత్రివర్యులు ఫరూక్ సొంత నిధుల నుండి రూ.1 లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సూచనల మేరకు మస్జీద్ అభివృద్ధికి సహకరిస్తూ, మస్జీద్ ఈద్గా కమిటీ అధ్యక్షులు బెండకాయల ఇస్మాయిల్ , ముఫ్తి రఫీ అహ్మద్ రూ.1 లక్ష రూపాయల నగదును ఫిరోజ్ తన చేతులా మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ, మస్జీద్‌లు, ఈద్గా వంటి ప్రార్థనా స్థలాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని, కుల మతాలకు అతీతంగా నంద్యాల. అభివృద్దె తమ లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా సున్ని మస్జీద్ & ఈద్గా కమిటీ సభ్యులు రాష్ట్ర మంత్రివర్యులు ఫరూక్ , ఫిరోజ్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.



## పంటల బీమా నమోదు ప్రక్రియ గడువు పెంచాలి....

### సిపిఐ మండల కార్యదర్శి శివయ్య



**బనగానపల్లె జులై 30నందిపత్రిక** రాష్ట్ర ప్రభుత్వం పంటల భీమా నమోదు పక్రియ గడువు ను పెంచాలని బనగానపల్లె సీపీఐ మండల కార్యదర్శి శివయ్య పేర్కొన్నారు. గురువారం మండల కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వం ఇదివరకే ప్రకటించిన పంటల భీమా నమోదు ప్రక్రియ ముగియడంతో చాలామంది రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు మీ సేవల దగ్గర సర్వర్ బిజీగా ఉండడం సైట్ ఓపెన్ కాకపోవడం కొన్ని టెక్నికల్ ఇబ్బందులతో చాలామంది రైతులు పంటల భీమా నమోదు చేసుకోలేకపోతున్నారు కావున ఈ నమోదు కార్యక్రమాన్ని గడువు పెంచాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రైతుల పక్షాన విజ్ఞప్తి చేస్తున్నాము మీరాపురం కటికవాణికుంట గ్రామాల్లో వర్షాలు లేక ఎండిపోతున్న పొలాలను పరిశీలించడం జరిగింది ఎలినో ప్రభావం వల్ల వర్షాలు రాక రైతులు తీవ్ర నిరాశతో ఉన్నారు కొంత పొలం విత్తనాలు కూడా వేయని పొలాలు ఉన్నాయి రైతు ఆకాశం వైపు వాన దేవుడా ఎప్పుడు వస్తావు అంటూ బిక్కు బిక్కుమంటూ ఆకాశం వైపు చూస్తున్నాడు ఇప్పటికే వర్షాలు లేక కంది కొర్ర మొక్కజొన్న ఆముదాలు మినుము సద్ద ఎండిపోతున్నాయి పెట్టిన పెట్టుబడి నేలపాలు అయిపోతుందని గుండెలు బాదుకుంటున్నాడు రైతు బనగానపల్లె పశ్చిమ వైపు ఉన్న గ్రామాల రైతులు వర్షాధారంపై ఆధారపడి పంటలు పండిస్తారు కానీ ఎల్లినో ప్రభావం వల్ల వర్షాలు రాక వేసిన పంటలు ఎండి పోతున్నాయి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు రాజని చెప్పడంలో కాదు రైతులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తా ఉన్నాం పంటల భీమా నమోదు ప్రక్రియను గడువు పెంచాలని విజ్ఞప్తి చేస్తావు ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు సంజీవులు పలుకూరు శాఖ కార్యదర్శి బాలయ్య పాల్గొన్నారు

## పట్టణంలో ముమ్మరంగా కొనసాగుచున్న డ్రైనేజీ పనులు

### నీటి సమస్య లేకుండా ఇంజనీర్ల చర్యలు



**బనగానపల్లె జులై 30నందిపత్రిక** బనగానపల్లె పట్టణంలో కొనసాగుతున్న అండర్ డ్రైనేజీ పనుల వల్ల పట్టణంలో నీటి సమస్య రాకుండా చూడాలని త్రాగునీటి శాఖ ఇంజనీర్లను మంత్రి బీసి జనార్దన్ రెడ్డి ఆదేశించారు. దింతో పట్టణంలో అండర్ డ్రైనేజీ పనులు కొనసాగుతున్న కాలనీలకు ఎటువంటి నీటి సమస్య తలెత్తకుండా త్రాగునీటి శాఖ ఇంజనీర్ సాయి కృష్ణ ముమ్మర చర్యలు చేపట్టారు. డ్రైనేజీ పనులు జరుగుచున్న ఆస్థానం రోడ్డులో పైపుల ద్వారా కుళాయిలకు నీటిని సరఫరా చేస్తున్నారు దింతో కాలనీలకు ఎటువంటి నీటి సమస్య లేదని కాలనివాసులు పేర్కొన్నారు.

## అభివృద్ధి,సంక్షేమమే కూటమి లక్ష్యం తెదేపా నేతలు

**ఎమ్మిగనూరు నంది పత్రిక జులై :30** అభివృద్ధి,సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నందవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ ధర్మపురం గోపాల్,తెదేపా మండల నాయకులు రైస్ మిల్ నారాయణరెడ్డి లు పేర్కొన్నారు.నందవరం మండలం హాలహర్వి గ్రామంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు 2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి,సంక్షేమం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులు ఇంటింటికీ (డోర్ టు డోర్) తిరుగుతూ కూటమి ప్రభుత్వం గత రెండు సంవత్సరాల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.సంక్షేమం భవిష్యత్తుకు భరోసా అన్ని ప్రాంతాల అభివృద్ధి అనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రజల కోసం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు.ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు,ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరించి,కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా అవగాహన కల్పించారు.ఎమ్మెల్యే బీవీ నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు ఎర్రన్న,క్లస్టర్ కో ఇన్చార్జి నాగరాజు,టిడిపి మండల కార్యదర్శి ప్రభుదాసు,బూత్ కన్వీనర్లు రాఘవేంద్ర,హరి కృష్ణ,టిడిపి నాయకులు జగన్నాథ్ రెడ్డి,గోవిందు, సురేష్,చిన్న దావీదు,రాగప్ప,ఎర్రం నాయుడు,కాసిం, ఏసేపు,యంకన్న,బుడ్డ రంగన్న,ఆంధ్రయ్య,ఉరుకుంద,జి దుబ్బన్న, వెంకటరాముడు,కార్పెంటర్ కాజా,బోయ రవి,టైలర్ మాబు,రామకోటి,వెంకటేష్,గాలి సంసోను,కల్లు గోవిందు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపిన పుణ్యమూర్తి సాంబశివరావు.

**మరణానంతరం నేత్రదానం చేసి మానవతాసేవకు నాంది పలికారు.**

**తండ్రి కోరిక నెరవేర్చిన ముగ్గురు కుమారులు.**





**నంద్యాల సిటీ బ్యూరో జులై 30 ( నంది పత్రిక )** సుమారు డెబ్బై ఐదు సంవత్సరాల వయస్సు గల పుణ్యమూర్తి సాంబశివరావు మరణానంతరం నేత్రదానం చేసి ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపేలా గొప్ప మానవతా సేవకు నాంది పలికారు. ఆయన కుమారులు పుణ్యమూర్తి శ్రీకాంత్, పుణ్యమూర్తి శంకర్, పుణ్యమూర్తి చంద్రమోహన్ కలిసి ఈ విషయాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ కండే ఆనంద్ గురుజీకి సమాచారం అందజేశారు. వెంటనే స్పందించిన కండే ఆనంద్ గురుజీ ఈ సమాచారాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ దస్తగిరికి తెలియజేశారు. ఆయన చొరవతో కర్నూలు ఐ బ్యాంక్ వారు సంఘటన స్థలానికి చేరుకుని టెక్నీషియన్ ప్రదీప్ నేతృత్వంలో నేత్రాలను సేకరించి హైదరాబాద్ లోని ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ కు పంపించారు. కండే ఆనంద్ గురుజీ మాట్లాడుతూ "మరణించిన తర్వాత కూడా ఇంకొకరి జీవితానికి వెలుగు నింపడం కన్నా గొప్ప దానం లేదు. సాంబశివరావు కుటుంబ సభ్యులు తీసుకున్న ఈ నిర్ణయం సమాజానికి స్ఫూర్తిదాయకం. ప్రతి కుటుంబం ఇలాంటి సేవాభావంతో ముందుకు వచ్చి నేత్రదానం, అవయవదానంపై అవగాహన పెంపొందించాలి" అని పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు సాంబశివరావు కుటుంబ సభ్యుల సేవాభావాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తూ, వారి నిర్ణయం అనేక మందికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. "నేత్రదానం మహాదానం. మన మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగు నింపే అవకాశం ప్రతి ఒక్కరికీ ఉంది. ప్రతి కుటుంబం ముందుకు రావాలి" అని రెడ్ క్రాస్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ సందేశం సమాజానికి నిజమైన మానవతా విలువలను గుర్తు చేస్తుంది.విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు



# జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్



**నంద్యాల బ్యూరో, జూలై 30(నంది పత్రిక):** నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గురువారం ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల పరిశుభ్రతను పరిశీలించారు. కార్యాలయ ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, పరిశుభ్రమైన వాతావరణంతో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ పరిపాలన, రీ-సర్వే పెండింగ్ అంశాలు, ప్రజలకు అందిస్తున్న సేవల పురోగతిపై ఆత్మకూరు ఆర్డీవో, ఆత్మకూరు తహసీల్దార్, కొత్తపల్లి తహసీల్దార్, డీఐఓఎస్ ఆత్మకూరు తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు సంబంధించిన ప్రతి దరఖాస్తును ప్రభుత్వం నిర్దేశించిన సేవా ప్రమాణాల గడువులోనే పరిష్కరించాలని సూచించారు. బియాండ్ ఎస్ఎల్ఏ కేసులు ఏవీ ఉండకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. రీ-సర్వే పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు..ఈ సమావేశంలో ఆత్మకూరు ఆర్డీవో వెంకటశివ, సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# నేడు సున్నిపెంటలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**"వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణ**



**నంద్యాల బ్యూరో, జులై 30(నంది పత్రిక):-** జిల్లా పరిపాలన ప్రజలకు మరింత చేరువ కావడం, స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడం లక్ష్యంగా చేపట్టిన "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 31వ తేదీన శ్రీశైలం నియోజకవర్గంలోని సున్నిపెంటలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణవేణి (రెడ్డివారి) కల్యాణ మండపంలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, సంబంధిత శాఖల ద్వారా తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల సమస్యలను నేరుగా పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గ పరిధిలోని శ్రీశైల మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విజ్ఞప్తి చేశారు.

# జిల్లా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు అధికారులు సమర్థవంతంగా పనిచేయాలి

**ఆగస్టు 1 నుంచి 13 వరకు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమాలు**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**




**నంద్యాల బ్యూరో, జూలై 30(నంది పత్రిక):-** జిల్లా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో భాగంగా నిర్వహించనున్న కెపాసిటీ బిల్డింగ్ (కెపాసిటీ బిల్డింగ్ ) శిక్షణ కార్యక్రమాలను అధికారులు పూర్తిస్థాయిలో వినియోగించుకొని జిల్లాకు సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేలా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. గురువారం ప్లానింగ్ శాఖ కార్యదర్శి పీయూష్ కుమార్ విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్లానింగ్ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 13 వరకు నిర్వహించనున్న కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులకు గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్, గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్, గ్రాస్ వ్యాల్యూ యాడెడ్ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన గణాంకాల సేకరణ, విశ్లేషణ, ప్రణాళికల రూపకల్పనలో ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయం మరియు అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవా రంగాలకు సంబంధించిన అంశాలపై పెహల్ ఇండియా ఫౌండేషన్ నుంచి ఐదుగురు రిసోర్స్ పర్సన్స్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 1న జిల్లా ప్రొఫైల్ రూపకల్పనపై ప్రత్యేక శిక్షణ, ఆగస్టు 5, 6 తేదీల్లో జిల్లా స్థాయి అధికారులకు పూర్తి స్థాయి శిక్షణ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంతకుముందు ప్లానింగ్ శాఖ కార్యదర్శి పీయూష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 1 నుంచి 13 వరకు నిర్వహించనున్న కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, శిక్షణ అనంతరం జిల్లా అధికారుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు శిక్షణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి, జిల్లాలో అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు అధికారులు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

# మహిళల అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటా

**జెసి జె జడ్జి పి ,హేమ**



**ఎమ్మిగనూరు నంది పత్రిక జూలై 30** అమాయకులైన మహిళలకు మాయమాటలు చెప్పి, వారిని అక్రమ మార్గాల్లో తరలించి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎమ్మిగనూరు జెసి జె కోర్టు జడ్జి పి. హేమ అన్నారు. గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం నందవరం గ్రామంలో జాతీయ మహిళల అక్రమ రవాణా నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మహిళలను మాయమాటలు చెప్పి వారిని అక్రమంగా ఇతర దేశాలకు తీసుకెళ్లి విక్రయించడం, వారితో తప్పుడు పనులు చేయించడం లాంటి పనులు చేస్తే అలాంటి వారికి కఠిన శిక్షలు ఉంటాయన్నారు. అభివృద్ధి చెందుతున్న నేటి ప్రపంచంలో మహిళలు అన్ని విషయాలపై అవగాహనలు కలిగి ఉండాలని సూచించారు. ఇలాంటి సంఘటనలు ప్రజల దృష్టికి వేస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించి వారిని కాపాడాలని కోరారు. అలాగే ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు ఎక్కువ ఉన్నాయని వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిమ్మారెడ్డి ,పోలీస్ సిబ్బంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# "ప్రజల ఆశీర్వాదం, సంపూర్ణ మద్దతుతో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం

**-"ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమానికి ప్రజల నుంచి అద్భుత స్పందన"**





**నంద్యాల సిటీ బ్యూరో జులై 30 ( నంది పత్రిక )** తెలుగుదేశం పార్టీ చేపట్టిన "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా నంద్యాల పట్టణంలోని 24వ వార్డులో టిడిపి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అలాగే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించి, వారి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు కూటమి ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ గడుపాటి నారాయణ స్వామి , తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు మనియార్ ఖలీల్ అహ్మద్ వార్డు ఇన్‌చార్జ్ సాయిరాం రాయల్ , టిడిపి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



# ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో,,,,, మండల అధ్యక్షులు కాసిం వలి,,,,,,



**ఎమ్మిగనూరు నంది పత్రిక జులై 30** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మరియు ఎమ్మిగనూరు శాసనసభ్యులు డాక్టర్ బి.వి జయ నాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 45 రోజుల ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా నాల్గవ రోజు నందవరం మండలం నది గంగవరం గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు కాశీం వలి క్లస్టర్ వన్ ఇంచార్జ్ కురువ వీరేష్ మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ, కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో సాధించిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ ఫలితాలను వివరించారు. ప్రతి కుటుంబానికి ఇంటింటా తెలుగుదేశం కరపత్రాలను అందజేస్తూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, బసప్ప, సలాం, నూర్ భాషా బూత్ కన్వీనర్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసి వెల్ఫేర్ ట్రస్ట్ తరుపున ఆర్థిక సహాయం



**బనగానపల్లె జులై 30నందిపత్రిక** బనగానపల్లె పట్టణంలోని లాల్ మస్జీద్ ప్రాంతానికి చెందిన గౌండా కార్మికుడు సయ్యద్ అబ్బాస్ అలీ విధి నిర్వహణలో భాగంగా కాలు జారి గాయపడిన విషయం తెలుసుకున్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం బీసీజేఆర్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా గురువారం రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు కార్మికుల సంక్షేమానికి బీసీ కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆమె భరోసా కల్పించారు.

# మై భారత్ పోర్టల్‌లో యువత నమోదు ప్రక్రియను చేపట్టండి

**నశా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ, యూత్ క్లబ్‌ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించండి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, జూలై 30(నంది పత్రిక):-** జిల్లాలో 16 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతను పెద్దఎత్తున మై భారత్ (మై భారత్ ) పోర్టల్‌లో నమోదు చేయించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మై భారత్ పోర్టల్‌లో యువత నమోదు కార్యక్రమాన్ని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్ ఆఫీసర్, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ల సమన్వయంతో విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ, వృత్తి విద్యాశాఖ, డిగ్రీ కళాశాలల కన్వీనర్లు తమ పరిధిలోని విద్యార్థులందరినీ పోర్టల్‌లో నమోదు చేయించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఇండియన్ రెడ్‌క్రాస్, క్రీడా వాలంటీర్లు, డీఆర్‌డీఏ, మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాల కుటుంబాల యువత, నర్సింగ్, పారామెడికల్ కళాశాలల విద్యార్థులు, ఇతర యువజన సంఘాల సభ్యులు కూడా మై భారత్ పోర్టల్‌లో నమోదు అయ్యేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. యువతలో సృజనాత్మకత, సామాజిక చైతన్యం పెంపొందించేందుకు పెయింటింగ్, వ్యాసరచన, క్విజ్, నృత్య పోటీలు తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి, యువజన సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో పోటీల షెడ్యూల్ రూపొందించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని తదుపరి స్థాయికి ఎంపిక చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీ స్థాయిలో యూత్ క్లబ్‌లను ఏర్పాటు చేసి యువతను ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి, డిప్యూటీ సీఈఓలు గ్రామ పంచాయతీల వారీగా యూత్ క్లబ్‌ల ఏర్పాటును పర్యవేక్షించి, ఎంపీడీఓల ద్వారా సంబంధిత వివరాలను నమోదు చేయించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా నిర్వహిస్తున్న నశా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా యువతందరూ ఆన్‌లైన్‌లో ప్రతిజ్ఞ చేసి సర్టిఫికెట్ పొందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన సాంకేతిక అంశాలు, కమ్యూనికేషన్ ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యువతకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. మై భారత్ పోర్టల్‌లో నమోదుకు సంబంధించి ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, రిఫరల్ కోడ్ విధానాన్ని వినియోగిస్తూ మరింత మంది యువతను పోర్టల్‌లో నమోదు చేయించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఆగస్టు 1 తేదీ నుండి నాణ్యమైన బియ్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేసుకోవాలి



జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా

**కడప బ్యూరో చీఫ్ జూలై 30 నంది పత్రిక** జిల్లా లోని రైతు బజార్లు, రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఆగస్టు 1వ తేదీ నుంచి నాణ్యమైన బియ్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ డా నిధీ మీనా, పౌర సరఫరా శాఖ అధికారులను ఆదేశించారు గురువారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్లో జాయింట్ కలెక్టర్ డా నిధీ మీనా, పౌర సరఫరాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై ఆగస్టు 1వ తేదీ నుంచి జిల్లాలో ప్రజలకు బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం కేజీ రూ.52/- లకు, గ్రేడ్ 1 పచ్చి బియ్యం (రా రైస్) రూ. 50/- లకు నాణ్యమైన బియ్యాన్ని అందించే లక్ష్యంతో చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, రాష్ట్ర వ్యాప్తంగా ఆగష్టు 1 నుంచి ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందించే కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో జిల్లాలో పౌర సరఫరాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు సమన్వయం తో పనిచేసి రైతు బజార్ల వద్ద మరియు రైస్ మిల్లర్స్ అవుట్ లెట్స్ వద్ద నాణ్యమైన బియ్యం అమ్మకాల కౌంటర్ల ఏర్పాటుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పౌర సరఫరా శాఖ అధికారులు ప్రతి రోజూ సంబంధిత కౌంటర్ల ను విజిట్ చేయడంతో పాటు స్టాక్ వివరాలను, ఓపెనింగ్, క్లోజింగ్ స్టాక్ వివరాలు నమోదు చెయ్యాలన్నారు. మంచి నాణ్యత గల బియ్యాన్ని అందుబాటు ధరలకు ప్రజలకు సరఫరా చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. గుర్తించబడిన రైస్ మిల్లు అవుట్‌లెట్ల ద్వారా ఆమోదించబడిన బియ్యం రకాలను మాత్రమే సరఫరా చేయాలని, అధిక ధరలు వసూలు చేయడం లేదా అనధికారికంగా అదనపు రుసుములను వసూలు చేయడం అనుమతించబడదని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాలను పాటించడంతో పాటు ఏర్పాటు చేసిన అన్ని అవుట్‌లెట్లలో తగినంత నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి అవుట్‌లెట్‌లో ధరల బోర్డులు, అందుబాటులో ఉన్న రకాలు, పనివేళలు మరియు కార్యక్రమ వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. వినియోగదారుల సంతృప్తికి ప్రాధాన్యత ఇస్తూ నాణ్యమైన బియ్యం నిరంతరాయంగా లభించేలా చర్యలు చేపట్టాలన్నారు. నాణ్యమైన బియ్యం అమ్మకాల విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్, పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్రహ్మణ్యేశ్వర రావు, డిఎం సివిల్ సప్లయ్ నాగ సుధ, మార్కెటింగ్ శాఖ ఏడి నరేంద్ర, పౌర సరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు....



# వినూత్న ఆవిష్కరణలకు వేదికగా.. "స్టార్ట్ అప్ కడప"..!!





జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడప, బ్యూరో చీఫ్ జూలై 30 నంది పత్రిక** సరికొత్త ఆలోచనలు, వినూత్న ఆవిష్కరణలకు వేదికగా జిల్లా యువతను పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రూపుదిద్దుకుంటున్న "స్టార్ట్ అప్ కడప" ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెంటర్ త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతోందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావనతో కలిసి నిర్మాణ పనులను పూర్తి చ్చేసుకుని చకచకా జరుగుతున్న ఫినిషింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భవనం బాహ్య నిర్మాణ పనులను వారంలోపు పూర్తి చేసి, వెంటనే అంతర్గత సదుపాయాల ఏర్పాటును వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా పనులను పూర్తి చేయాలని సూచించారు.ప్రతి ఇంటి నుంచి ఒక స్టార్టప్ ఆవిర్భవించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా "స్టార్ట్ అప్ కడప" రూపుదిద్దుకుంటోందన్నారు. ఇది కేవలం ఒక భవనం కాదని.. యువత ఆలోచనలకు, ఆవిష్కరణలకు, కొత్త వ్యాపారాల ఆరంభానికి బలమైన వేదికగా నిలవనుందన్నారు. ఈ కేంద్రం ద్వారా స్టార్ట్అప్ వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలకు అవసరమైన మార్గదర్శకత్వం, ఆధునిక సదుపాయాలు, ప్రోత్సాహం లభిస్తాయని తెలిపారు.

కడపను పారిశ్రామిక అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నిర్మాణ పనుల పరిశీలనలో కేఎంసీ కమిషనర్ భవానీ ప్రసాద్, హౌసింగ్ ఇంజనీర్లు, ఏడీపీ యంగ్ ప్రొఫెషనల్స్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రతి దుకాణానికి ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి.





కమిషనర్ శారదా దేవి.

**తిరుపతి బ్యూరో చీఫ్ జూలై 30 నంది పత్రిక** నగరంలోని అన్ని రకాల దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకుని వ్యాపారాలు నిర్వహించుకోవాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్, ప్రత్యేక అధికారి, కమీషనర్ గారి ఆదేశాల మేరకు బుధవారం రాత్రి పిర్యాదు అందిన జగజీవన్ రాం పార్క్ వద్ద గల బిర్యానీ ఫ్యాక్టరీని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ జగజీవన్ రాం పార్క్ వద్ద గల బిర్యానీ ఫ్యాక్టరీ నందు బిర్యానీ తిని చిన్న అమ్మాయికి ఫుడ్ పాయిజన్ కావడంతో అమ్మాయి ట్రీట్మెంట్ తీసుకుంటున్నదని తెలిపారు. ఈ పిర్యాదు మేరకు తాను, , వెటర్నరీ ఆఫీసర్, ఫుడ్ సేఫ్టిఆఫీసర్, సిబ్బంది, శానిటరీ సిబ్బంది తో కలిసి తనిఖీకి చేశామని తెలిపారు. అందులో హోటల్ నడుపుటకు మునిసిపల్ కార్పొరేషన్ నిబంధనల ప్రకారం ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండా వ్యాపారం చేయడం, బిర్యానీ తయారు చేయుటకు వినియోగించు చికెన్ సరిఅయిన స్టోరేజ్ లో లేకపోవడం, వాటిపై లేబల్స్, తయారీ గడువు లేబుల్స్ లేకపోవడం గుర్తించామని తెలిపారు. ఫ్రీజర్ సరైన కండిషన్ లో లేకపోవడం, స్టోర్ రూంలో వంటకు వినియోగించు కూరగాయలు పాడాయి ఉండడం, స్టోర్ నందు పనికిరాని వ్యర్థాలు నిలువ చేసి ఎలుకల విసర్జనలు ఉండడం, క్లీనింగ్ ఏరియా వంటరూమ్ కలిసి ఇన్ శానిటరీ కండిషన్ లో ఉండడం, మరియు పనిచేసె వర్కర్సకి పర్సనల్ ప్రొటెక్షన్ కిట్స్ లేకపోవడం వలన సప్లైలో కాంటామినేషన్ రావడానికి ఆస్కారమున్నందున ప్రజారోగ్య దృష్ట్యా బిర్యానీ ఫ్యాక్టరీ హోటలను సీజ్ చేశామని తెలిపారు ఫూడ్ సెప్టి ఆఫీసర్ అందుబాటులో ఉన్న బిరియానిని, పెరుగును శాంపుల్స్ తీసి కల్తీ పరీక్ష నిమిత్తం పంపామని తెలిపారు. ప్రతి ట్రేడ్ ఓనర్స్ మునిసిపల్ ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకొని సరైన నాణ్యత ప్రమాణాలతో వ్యాపారం చేయాలనీ హెచ్చరించారు. ప్రజలకుడా తక్కువరేట్లు చూసి మోసపోవద్దని నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేయాలనీ తెలిపారు.



## కడప జిల్లా కాంగ్రెస్ కార్యాలయం జాతి గర్జన అనే కార్యక్రమం పై యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి శ్రీ నాగ మధు యాదవ్ ఉపాధ్యక్షులు ....



**నందిని ప్రతినిధి, జులై 30, వైయస్సార్ కడప జిల్లా** యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి నాగ మధు యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మూర తోటి విజయ్ కుమార్, మాట్లాడుతూ జరిగిన ఘటనపై తీవ్రంగా ఖండిస్తున్నాము, స్వాతంత్రం సంపాదించిన టువంటి జవహర్లాల్ నెహ్రూ వారి కుటుంబ సభ్యుల మీద రాజీవ్ గాంధీ కుమారుడు రాహుల్ గాంధీ మీద జరిగినటువంటి ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగిన విషయాలపై చర్చావేదికగా కాంగ్రెస్ పార్టీ సోనం భానుచంద్ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష ఉద్యమిచ్చారు మద్దతుగా లక్షలాదిమంది విద్యార్థులు దంతర మంతర్ చేరుకున్నారు ఈ ఉద్యమాన్ని అంజి వేయడానికి బీజేపీ ప్రభుత్వం పోలీసులు కలిసి విద్యార్థులు మద్దతుదారులపై జనరల్ లిస్ట్ లపై జరిగిన దాడి తీవ్ర ఆక్షేపనియం. 20 ఎక్కువ రోజులు తర్వాత సోనం గారి దీక్షను బలవంతంగా విరివింపజేశారు. అలాగే మన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ. బిజెపికి సపోర్ట్ చేస్తున్నారు, జనసేన ఏమీ మాట్లాడటం లేదు. బిజెపి అడుస్తున్నారని. విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని. వార్ డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బలవంతంగా ఏడ్చి రత్త గాయాలైనట్లు వాసవికంగా దాడి చేశారు. ఉద్యమకారులపై బనాయించిన కేసులు ఎత్తివేయడం మిగతాపూర్వకంగా రాయించిన ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు తిరిగి ఉద్యమ రూపం దాల్చుకుంటూ ఉంది.

**రైతుల న్యాయమైన డిమాండ్లతో జంతరమంతా చేరుకున్నారు.** బీహార్ లో రైతుల ఉద్యమాల జరుగుతున్నాయి. దేశమంతటా అనేక సమస్యల పట్ల ఉద్యమాలు , ఉద్యమాలకు మద్దతుగా అందరూ తీర్మానం చేశారు

## కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి మోసాల మీద మోసాలు చేస్తుంది.

### వైఎస్ఆర్సిపి 34 డివిజన్ ఇంచార్జ్ రాష్ట మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్ అలీ అక్బర్



**కడప జూలై 30** కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి మోసాల మీద మోసాలు చేస్తుంది ప్రస్తుతం కడప లో 15వ ఆర్థిక సంఘం (ఫైనాన్స్ కమిషన్ ) నిధులను కొద్ది వార్డులకే పరిమితం చేయడం ఎంతవరకు సమంజసమని వైఎస్ఆర్సిపి 34 డివిజన్ ఇంచార్జ్ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సాలీ అక్బర్ మండిపడ్డారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కడప నగరపాలక సంస్థచివరి జనరల్ బాడీ మీటింగ్ సమావేశంలో కడప కార్పొరేషన్ మేయర్ పాక సురేష్ ప్రతి ఒక్క డివిజన్ కి నిధులు కేటాయించడం జరిగింది కానీ నీదులు కొంత డివిజన్లకు మాత్రమే మల్లించడం చూస్తుంటే కొన్ని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కడప నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 50 డివిజన్లు ఉండగా, సమస్యలు అన్ని వార్డుల్లోనూ ఉన్నాయి. అయితే 15వ ఆర్థిక సంఘం నిధులను కేవలం 7 లేదా 8 డివిజన్లకే కేటాయించడం సమాన అభివృద్ధి సూత్రాలకు విరుద్ధం.ప్రజలందరూ సమానంగా పన్నులు చెల్లిస్తున్నప్పుడు, అభివృద్ధి పనులు కూడా అన్ని వార్డుల్లో సమానంగా జరగాలి. కొన్ని డివిజన్లకే నిధులు కేటాయించి, మిగిలిన వార్డులను నిర్లక్ష్యం చేయడం వల్ల అక్కడి ప్రజలు తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు వంటి ప్రాథమిక సౌకర్యాలకు నోచుకోకుండా ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల 15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపుపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలి. ఏ ప్రమాణాల ఆధారంగా పనులు ఎంపిక చేశారో తెలియజేయాలి. మిగిలిన అన్ని డివిజన్లలో కూడా అత్యవసర అవసరాలను గుర్తించి, సమాన న్యాయంతో నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని కడప నగరపాలక సంస్థను, సంబంధిత అధికారులను కోరుతున్నాము.

## ఆగస్టు 13, 14,15 తేది లలో ఉరుసు మహోత్సవాలు



**కడప జూలై 30** ప్రముఖ సూఫీ పుణ్యక్షేత్రం కడప అమీన్ పీర్ దర్గా లో హజరత్ అమీన్ పీర్ స్వామివారి ఉరుసు మహోత్సవాలు ఆగస్టు 13 నుంచి15 వరకు ఘనంగా నిర్వహించనున్నారు.13తేదిన గంధ మహోత్సవం, 14 తేదిన ఉరుసు మహోత్సవం 15 తేదిన తహలీల్ ఫతేహ ఈ మూడు రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు, ఫాతేహా, దువా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ఆంధ్ర ,తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారు. ఈ ఉరుసు కార్యక్రమాలు కడప అమీన్ పీర్ దర్గా 11పీఠాధిపతి అమీన్ హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరీఫుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేనీ చిష్టి ఉల్ ఖాదరి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించబడును. కావున భక్తులందరూ విచ్చేసి స్వామివారి ఆశీర్వాదం పొందవలసిన కోరుచున్నాము.

## డీఎస్సీ స్పోర్ట్స్ కోట నియామకాల విషయంలో రాష్ట్రంలో నిరుద్యోగ యువతలో అనేక సందేహాలు

### వైఎస్ఆర్సిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల శివ యాదవ్

**కడప జూలై 30** డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల విషయంలో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతలో అనేక సందేహాలు ఉన్నాయి. లక్షలాది మంది యువత పోటీ పరీక్షలు రాసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే, స్పోర్ట్స్ కోటా నియామకాలు ఏ జీవో ప్రకారం జరిగాయో ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని వైయస్సార్సీపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల శివ యాదవ్ మండిపడ్డారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ2012లో వచ్చిన జి.ఓ. నెం.74 ప్రకారం ఒక విధానం ఉండగా, 2025లో జి.ఓ. నెం.4, జి.ఓ.47 ద్వారా మరో విధానం తీసుకొచ్చారు. అయితే డీఎస్సీ నియామకాల్లో చివరకు ఏ జీవో అమలు చేశారో ప్రభుత్వం ప్రజలకు తెలియజేయాలి.మాకు క్రీడాకారులపై ఎలాంటి వ్యతిరేకత లేదు. కానీ ఉపాధ్యాయ నియామకాలు పూర్తిగా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరగాలి. అందుకే డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై స్వతంత్రంగా సమగ్ర విచారణ జరపాలని మేము డిమాండ్ చేస్తున్నాం.అలాగే జి.ఓ.74, జి.ఓ.4, జి.ఓ.47 అమలు ఎలా జరిగిందో శ్వేతపత్రం విడుదల చేయాలి. ఎంపికైన అభ్యర్థుల మెరిట్, అర్హతలు, ఎంపిక విధానాన్ని ప్రజలకు వెల్లడించాలి.ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. నిరుద్యోగ భృతిని అమలు చేయాలి. యువత భవిష్యత్తు కోసం వైఎస్సార్‌సీపీ ఈ నెల 31వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా మెగా నిరసన ర్యాలీలు నిర్వహిస్తుంది. యువత పెద్ద ఎత్తున పాల్గొని తమ హక్కుల కోసం గొంతెత్తాలని కోరుతున్నాను.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# ఐటీ కంపెనీలకు భూములు, భవనాలు అద్దెకివ్వండి

**కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

**3 సెంట్లు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న భూములు, భవనాల యజమానులు అర్హులు**



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** కర్నూలు నగర పరిధిలో 3 సెంట్లు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన భూములు, భవనాలను ఐటీ కంపెనీలకు లీజుకు లేదా విక్రయించేందుకు ఆసక్తి ఉన్న యజమానులు ముందుకు రావాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఖాళీ స్థలాలు, నిర్మాణంలో ఉన్న భవనాలు, పూర్తిగా నిర్మించిన భవనాలను ఐటీ కంపెనీల అవసరాలకు అనుగుణంగా లీజుకు లేదా విక్రయించేందుకు ఆసక్తి ఉన్న వారు కలెక్టరేట్ కార్యాలయంలోని డీఆర్వో ఛాంబర్‌లో సంప్రదించాలని సూచించారు.ఈ మేరకు జిల్లా ఐటీ మేనేజర్ ఎస్. లీలావతి సెల్ నంబర్ 7042930572ను సంప్రదించాలని కమిషనర్ తెలిపారు. ఆసక్తి ఉన్న భూములు, భవనాల యజమానులు సంప్రదించే సమయంలో స్థలం లేదా భవనం ఫొటోలు, యజమాని పేరు, సంప్రదింపు ఫోన్ నంబర్, ఈ-మెయిల్ వివరాలు, భూమి లేదా భవనం విస్తీర్ణం, లీజుకు లేదా విక్రయానికి సంబంధించిన వివరాలు, ఆశిస్తున్న లీజు లేదా విక్రయ ధర తదితర సమాచారాన్ని అందించాలని సూచించారు.కర్నూలు నగరంలో ఐటీ రంగ అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించడంతో పాటు, ఐటీ కంపెనీల ఏర్పాటుకు అవసరమైన భూములు, భవనాల లభ్యతను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఈ వివరాలను సేకరిస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. అర్హత కలిగిన భూములు, భవనాల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వివరాలను అందించాలని కోరారు.

## ఏపీ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యింది

### వైసిపి రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూలై 30 నంది పత్రిక** రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుందని ఏ ఒక్క హామీనీ నేవేర్చలేకపోయారని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిశోర్ రెడ్డి విమర్శించారు. గురువారం నాడు పట్టణంలోని ఆయన నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రెండేళ్ల పాలనలో సూపర్ సిక్స్ హామీలు కొత్త పెన్షన్లు మహిళలకు ఇస్తామన్న సహాయం వంటివి అన్ని రంగాలలో అమలు చేయడంలో ఎన్ డి ఏ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రజల్లోకి ఏ మొహం పెట్టుకొని వెళ్తున్నారు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని ఇసుక దోపిడీ అహోబిలంలో టోల్ గేట్లు వసూళ్లు తలనీలాలు ఇచ్చే భక్తుల నుండి టికెట్ పది రూపాయలు ఉంటే 150 రూపాయలు తలనీలాలకు వసూలు చేస్తున్నారని పొలంలో మట్టి త్రవ్వకాలపై ట్రాక్టర్ 200 వసూలు చేస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. వాటిని కప్పించుకోవడానికి ఎప్పుడు ఎమ్మెల్యే ఆమె భర్తపై నిందలు వేయడం తగదని ఆయన దాదాపు 20 రోజులుగా ఆళ్లగడ్డ పట్టణం లేకపోయినా ఏమైనా ఆగాయా అని ప్రశ్నించారు ఇతరులపై నెపం నెట్టడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

## అప్పుల బాధతో రైతన్న ఆత్మహత్య



**కొత్తపల్లి - నంది పత్రిక. :** వ్యవసాయం కోసం చేసిన అప్పులను తీర్చలేననే భయంతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది ఏఎస్ఐ తెలిపిన వివరాల మేరకు కొత్త మాడుగుల గ్రామానికి చెందిన చంద్రయ్య కుమారుడు ఈడిగ బాలస్వామి గౌడ్ (50) అతను తనకు వున్న రెండు ఎకరాల పొలంతో పాటు గ్రామంలో రైతుల దగ్గర 10 ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేస్తూ ఉన్నాడు. అయితే ఈ సంవత్సరం కూడా మొక్కజొన్న సాగు చేసుకోగా వర్షం సకాలంలో పడకపోవడం వల్ల పంట ఎండిపోయింది. గతంలో చేసిన సుమారు 15 లక్షల రూపాయల అప్పులను తీర్చలేను అని భయాందోళనకు చెంది 28.07.2026 ఉదయం 7 గంటల సమయం లో తన కౌలుకు తీసుకున్న పొలం దగ్గరికి వెళ్లి ఆత్మహత్య చేసుకోవాలని ఉద్దేశంతో గడ్డి మందు తాగడు గ్రామస్తులు ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతన్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స కోసం కర్నూల్ కు రిఫర్ చేశారు అక్కడ ఒక ప్రైవేటు వైద్యశాలకు తీసుకొని వెళ్లగా అతను బుధవారం చికిత్స పొందుతూ మరణించినాడు. తన కొడుకు అయిన విక్రమ్ కుమార్ గౌడ్ ఇచ్చిన పిర్యాదు మేరకు కొత్తపల్లి ఏఎస్ఐ రామ్ నాయక్ కేసు నమోదు చేశారు

## నేడే (జులై 31) పంటల బీమాకు చివరి గడువు...!

### జిల్లా రైతులు అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి

**కడప బ్యూరో చీఫ్, జులై 30 నంది పత్రిక** కడప జిల్లా రైతులు వాతావరణ ఆధారిత పంటల బీమా, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనల కింద జులై 31 లోపు తమ పంటలకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి గురువారం రాత్రి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పంటల బీమా పథకాలను ప్రతి అర్హ రైతు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గడువు ముగిసిన తర్వాత బీమా నమోదు అవకాశం ఉండదని, అందువల్ల ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రీమియం చెల్లించాలని కోరారు.వాతావరణ ఆధారిత బీమా పథకం కింద అరటి, చిని (బత్తాయి/నిమ్మ), ప్రత్తి, వేరుశనగ పంటలు సాగు చేస్తున్న రైతులు నేడే ప్రీమియం చెల్లించి బీమా నమోదు పూర్తి చేసుకోవాలని తెలిపారు. జులై 31 అర్ధరాత్రి వరకు మాత్రమే గడువు ఉన్నందున రైతులు ఆలస్యం చేయవద్దని స్పష్టం చేశారు.అలాగే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద వరి మినహా ఇతర ప్రధాన పంటలకు బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా పసుపు, మినుము, కంది తదితర పంటలు సాగు చేస్తున్న రైతులు కూడా నేడే చివరి అవకాశంగా భావించి బీమా చేయించుకోవాలని సూచించారు. పంటల బీమా రైతులకు ఆర్థిక భరోసాను కల్పిస్తుందని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టాలను కొంత మేర భర్తీ చేసుకునేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సకాలంలో పంటల బీమా నమోదు పూర్తి చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఆడిట్ నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ జూలై 30 నంది పత్రిక** జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిను స్టేట్ ఆడిట్ విభాగం (జోన్-2, ఏలూరు) ప్రాంతీయ ఉప సంచాలకులు (రీజినల్ డిప్యూటీ డైరెక్టర్) బి.ఆర్. క్రాంతి కుమారి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ విభాగాల ఆర్థిక వ్యవహారాలపై చర్చించారు. జిల్లా పరిధిలోని స్థానిక సంస్థల, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, మండల, జిల్లా పరిషత్‌లు ఆడిట్ నిర్వహణ, నిధుల వినియోగం, మరియు రికార్డుల క్రమబద్ధీకరణ వంటి కీలక అంశాలపై వారి మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. స్థానిక సంస్థలలో ఆర్థిక క్రమశిక్షణ, పారదర్శకతను పెంపొందించేందుకు ఆడిట్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. సమయానికి ఆడిట్ పూర్తి చేయడం ద్వారా స్థానిక సంస్థల జవాబుదారీతనం పెరుగుతుందని, ప్రభుత్వ నిధులు సద్వినియోగం అవుతాయని రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ క్రాంతి కుమారి కలెక్టర్‌కు వివరించారు. ఈ మర్యాదపూర్వక సమావేశంలో స్టేట్ ఆడిట్ విభాగానికి చెందిన ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

## చంద్రబాబు ప్రభుత్వంలో అవినీతి పెరిగిందని మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి విమర్శ



**పోరుమామిళ్ల, జూలై 30 (నంది పత్రిక):** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి, లంచగొండితనం పెరిగిందని మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి ఆరోపించారు.ఎన్నికలకు ముందు అవినీతి రహిత పాలన అందిస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన అనంతరం ఆ హామీని నిలబెట్టుకోలేకపోయిందని ఆయన విమర్శించారు. ప్రస్తుతం రెవెన్యూ, పోలీస్ శాఖలతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సాధారణ ప్రజలు తమ పనులు చేయించుకోవాలంటే లంచాలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.అధికార పార్టీకి చెందిన ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి చేసిన వ్యాఖ్యలే రాష్ట్రంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో ప్రజలకు అర్థమయ్యేలా చేస్తున్నాయని ఆయన అన్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు, నాయకులు ప్రతి పనికి డబ్బులు వసూలు చేస్తున్నారని, ఇసుక, గ్రావెల్ కాంట్రాక్టర్లు, వ్యాపారులు, బెల్ట్ షాపుల నిర్వాహకుల నుంచి కూడా వసూళు జరుగుతున్నాయని ఆరోపించారు.ప్రజాప్రతినిధులను చూసి పైస్థాయి నుంచి కింది స్థాయి అధికారుల వరకు లంచం ఇస్తేనే పనులు జరుగుతున్న పరిస్థితి నెలకొన్నదని, ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు దగ్గరపడుతున్నాయని వ్యాఖ్యానించారు.చంద్రబాబు ప్రభుత్వ హయాంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మట్కా, జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, దోపిడీలు పెరిగాయని ఆరోపించారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలకు కేంద్రంగా మారిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల నిధులు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేవని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి కనిపించడం లేదని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉందని పోతిరెడ్డి నాగార్జున రెడ్డి పేర్కొన్నారు.

## వెట్టిచాకిరీ, మానవ అక్రమ రవాణా నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




**భీమవరం బ్యూరో చీఫ్ జూలై 30 నంది పత్రిక** వెట్టిచాకిరీ అనేది సమాజంలో పాతుకుపోయిన ఒక పెద్ద మోసం, దీనిని అంతం చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి" అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. ' ప్రపంచ మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవం 2026' పురస్కరించుకుని గురువారం జిల్లా కలెక్టరేట్ లోని ఛాంబర్ నందు ప్రత్యేక అవగాహన పోస్టర్‌ను ఆమె చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొద్దిపాటి అడ్వాన్స్ డబ్బులు ఆశ చూపి జీవితకాలం దోపిడీకి గురిచేసే వెట్టిచాకిరీ విధానాన్ని బాలల పై లైంగిక దాడులు నివారణను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తిగా నివారించాలని అన్నారు. ఇలాంటి మోసాలను గుర్తించి, మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ లేని సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. బాధితులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, కార్మిక శాఖ మరియు చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ ( సి ఆర్ ఏ ఎఫ్) సంయుక్తంగా ఈ అవగాహన కార్యక్రమాన్ని రూపొందించాయి. సమాజంలో ఎక్కడైనా వెట్టిచాకిరీ లేదా బాల కార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణా వంటి ఉదంతాలు కనిపిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 100 మరియు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్. రాజేష్, లేబర్ డిపార్ట్మెంట్ ఇంచార్జ్ అసిస్టెంట్ కమిషనర్ డి లక్ష్మి, క్రాఫ్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ ఆర్ శ్రీనివాస్, అచ్యుత్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో గెలవకుండా మంత్రిగా ఇంకెంతకాలం

ఎన్నికల్లో గెలవని వ్యక్తిని ఇంకెంతకాలం మంత్రిగా కొనసాగిస్తారని బిహార్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఆ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దీపక్ ప్రకాశ్ ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసింది. ఆరు నెలల గడువు ముగిసిన తర్వాత కూడా ఆ పదవిలో కొనసాగించడంపై సమాధానం చెప్పాలని సమ్రాట్ చౌధరీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. సాధారణంగా ఎన్నికల్లో గెలవని వ్యక్తులు రాష్ట్ర మంత్రిగా నియమితులైతే.. వారు ఆరునెలల్లోగా ఏదో ఒక నియోజకవర్గం నుంచి గెలివాల్సి ఉంటుంది. లేదా శాసనమండలి సభ్యుడిగానైనా ఎన్నిక కావాలి. కానీ దీపక్ ప్రకాశ్ 2025 నవంబర్‌లో పంచాయతీ రాజ్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. తొలుత ఏప్రిల్ 25, 2026 వరకు మంత్రిగా కొనసాగారు. అప్పుడు నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో క్యాబినెట్ మొత్తం రద్దయింది. తర్వాత సమ్రాట్ చౌధరీ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయగా.. దీపక్ మళ్లీ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మధ్యలో 22 రోజులు ఏ పదవీలో లేరు. అంటే నిరవధికంగా ఆరునెలల పాటు దీపక్ మంత్రిత్వ బాధ్యతల్లో లేనట్లయ్యింది. సాధారణంగా ఆరు నెలల్లోపు శాసనసభకు ఎన్నిక కాకపోతే.. మంత్రి పదవిని కోల్పోతారు. కానీ ఇక్కడ ఒకే మంత్రి విషయంలో ఆరు నెలల గడువును రెండుసార్లు వినియోగి చడం

## మహానంది పుణ్యక్షేత్రంలో వైభవంగా వరుణ యాగం



**మహానంది జూలై 30 (నంది పత్రిక ):-** వర్షాలు బాగా కురవాలని మహానంది పుణ్యక్షేత్రంలో వరుణ యాగం నిర్వహించారు.ఆలయ ఈవో ఎన్.శ్రీనివాస్ రెడ్డిచే వేదపండితులు రవిశంకర్ అవధాని,ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జున శర్మ,పండితులు, అర్చకుల బృందం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణ ధారణ, కలశస్థాపన, వరుణ సూక్త పారాయణములు, నిర్వహించారు. అనంతరం లోపలి కోనేరులో జపాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న వర్షాబావ పరిస్థితులు తొలగి పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని ఈ మూడు రోజులపాటు మహానంది క్షేత్రంలో వరుణ యాగాలు నిర్వహిస్తున్నామన్నారు.శుక్రవారం కలశార్చనలు, మహన్యాస రుద్రాభిషేకం, రుద్ర హోమం, వరుణ వాహక హోమాలు, రుద్రగుండం కోనేరులో వరుణ జపాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పేద మహిళలకు చీరలు విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూలై 30 నంది పత్రిక** అవోపా శాశ్వత సేవ నిధి కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ పట్టణంలో గురువారం నాడు చాటకొండ ఓబులేశ్వర్ శెట్టి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలిసి 40 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు కొండ పల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 400 కాపీ నోటు పుస్తకాలను అందజేశారు ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడానికి ఒక నమ్మకమైన సంస్థ అవో పాఅని తెలిపారు.

## మహానంది స్వామిని దర్శించుకున్న నూతన ఎస్సీ సంక్షేమ అధికారి మాలపాటి వెంకట శివారెడ్డి

### జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వైనం

### విద్యార్థుల సంక్షేమం, హాస్టళ్ల పర్యవేక్షణకు తొలి ప్రాధాన్యం



**నంది పత్రిక , జూలెం 30 :** నంద్యాల జిల్లా ఎస్సీ వెల్ఫేర్ ఎంపవర్‌మెంట్ అధికారిగా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించిన మాలపాటి వెంకట శివారెడ్డి సతీసమేతంగా, కుటుంబ సభ్యులతో కలిసి ప్రముఖ పుణ్యక్షేత్రం మహానందిలోని శ్రీ కామేశ్వరీ దేవి సమేత మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విధులు స్వీకరించిన అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. స్వామివారి దర్శనం అనంతరం వెంకట శివారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలు, నంద్యాల జిల్లా వాసులు, షెడ్యూల్డ్ కులాల ప్రజలు, హాస్టల్ విద్యార్థులు, సంక్షేమాధికారులు, సిబ్బంది అందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

**విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు:** ప్రభుత్వ హాస్టళ్లలో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి హాస్టల్‌ను నిరంతరం పర్యవేక్షిస్తానని, విద్యార్థుల సంక్షేమంలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా బాధ్యతాయుతంగా పనిచేస్తానని చెప్పారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం. నాయక్, డైరెక్టర్ లావణ్య వేణి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అదేవిధంగా ఎస్సీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రజాసంఘాలతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు.

**వెల్లువెత్తిన అభినందనలు:** మాలపాటి వెంకట శివారెడ్డికి మాల మహానాడు, ఎమ్మార్పీఎస్, వివిధ ఎస్సీ వర్గాల ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, సామాజిక సంస్థల ప్రతినిధులు శు భాకాంక్షలు తెలిపారు. ఆయన నిజాయితీ, క్రమశిక్షణ, పారదర్శకతతో సేవలు అందించి బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.



## నిర్దేశించిన లక్ష్యాలను పోటీతత్వంతో పనిచేసి అధికారులు లక్ష్యాలను అధిగమించాలి.

**అర్హులకు సంక్షేమ ఫలాలు, పౌరసేవలు అందించుటలో మనస్సుపెట్టి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయి. అలసత్వం, నిర్లక్ష్యం వహించే అధికారులకు శాఖా పరమైన చర్యలు తప్పవు. జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...**



**ఏలూరు బ్యూరో చీఫ్, జూలై 30 నంది పత్రిక** జిల్లా కలెక్టరేటు గోదావరీ సమావేశ మందిరంలో గురువారం రెవిన్యూ పరమైన పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్లు, లావాదేవీలు మరియు సవరణలు కోసం మ్యూటేషన్, పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ, అర్హులు అందరికీ గృహాలు, ఐవిఆర్ఎస్ పోనుకాల్స్, ఆర్ వోఆర్ కేసులు, 22 (ఏ) కేసులు, కోర్టుకేసులు, డిజిటలైజేషన్ రెవెన్యూ ఇన్వెంటరీ, వరద మరియు విపత్తునిర్వహణ తదితర 14 అంశాలుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ, అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి యం.శ్రీదేవి లు పాల్గొన్నారు. ఒక్కొక్క అంశం మీద మండలాలు వారీగా సమీక్షించి, నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు కలిసికట్టుగా పనిచేసి లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. లక్ష్యాలులో వెనుకబడిన అధికారులకు చర్యలు తప్పవని జిల్లా కలెక్టరు హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు కలిసికట్టుగా పనిచేసి లక్ష్యాలు అధిగమించాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పౌరసేవలు అందించుటలో మనస్సుపెట్టి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. అలసత్వం, నిర్లక్ష్యం వహించే అధికారులకు చర్యలు తప్పవని హెచ్చరించారు. పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్లు అర్జీలు శాశ్వత పరిష్కారం చూపాలి అన్నారు. కొందరు అధికారులు మాశాఖకు సంబంధించింది కాదని, కాలయాపన చేస్తున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. వివాదాలకు తావులేకుండా పట్టాదారు పాసుపుస్తకాలు రూపొందించాలని, అర్హులు అయిన వారందరికీ అందజేయ్యాలని అన్నారు. పౌరసేవలో ఎక్కడ కూడా ఒక్కఫిర్యాదు రాకుండా ప్రత్యేక దృష్టిపెట్టాలని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహాలు మంజూరు చెయ్యాలని, నిర్మాణంలో ఉన్న గృహాలను వేగవంతం చేసి లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించాలని అన్నారు. కొన్ని శాఖలు పనితీరుపై ఐవిఆర్ఎస్ రిపోర్టులు వివరిస్తూ, అసహనం వ్యక్తం చేస్తూ పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని అన్నారు. కోర్టుకేసులు పురోగతిపై ఎప్పటికప్పుడు పరిశీలన చేసుకోవాలని, కాలయాపనలు చేస్తే ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. గత అనుభవాలను జోడిస్తూ వరదలుపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలాలు వారీగా ప్రత్యేక అధికారులను నియమిస్తూ, కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు సిద్ధం చెయ్యాలని అన్నారు. ప్రతి అంశాన్ని సీరియస్ గా తీసుకోవాలని, సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచెయ్యాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పెండింగులో ఉన్న ధరఖాస్తులు, ఫిర్యాదులు, కేసులను వేగంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు, రెవెన్యూ సేవలు అందించుటలో పారదర్శకత, జవాబు దారీతనంతో పనిచెయ్యాలని సూచించారు. ఈ సమావేశంలో నూజివీడు సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న,విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎల్.దేవకీదేవి, ఆర్డీవోలు కె.లక్ష్మీప్రసన్న, యం.వి.రమణ, సంబంధిత జిల్లా అధికారులు, తహాశీల్దార్లు, డిప్యూటీ తహాశీల్దార్లు, మండల సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో నూతన పరిశ్రమలు ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి.



**జిల్లా సమగ్ర అభివృద్ధికి నూతన పెట్టుబడిదారులను ఆకర్షించేలా అధికారులు కృషి చేయాలి. నూతన పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు, బ్యాంకు రుణాల మంజూరులో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం బ్యూరో చీఫ్ ప్ జూలై 30 నంది పత్రిక** కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో గురువారం జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం మరియు ఇన్వెస్టర్లతో ముఖాముఖి సమావేశం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతన పరిశ్రమలు ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాన్నారు .జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం కావాలంటే సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో కొత్తగా పరిశ్రమలు స్థాపించేందుకు పలువురు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని, వారికి అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు, బ్యాంకు రుణాల మంజూరులో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎంఎస్ఎంఈ యూనిట్లతో పాటు పలువురు కలిసి క్లస్టర్ రూపంలో ఏర్పడి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న ఆలోచనలతో ముందుకు వస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహకారంతో వేగంగా అభివృద్ధి సాధించవచ్చని వివరించారు.ఎం ఎస్ ఎమ్ ఈ పార్కులలోని ఖాళీ స్థలాలను ఆసక్తి ఉన్న వ్యాపారవేత్తలకు కేటాయించాలన్నారు. అనంతరం పరిశ్రమల శాఖ ప్రగతిని సమీక్షిస్తూ, జూలై 9వ తేదీ నుండి 29 తేదీ వరకు నాటికి వరకు సింగిల్ విండో పోర్టల్ ద్వారా వివిధ శాఖల అనుమతుల కోసం మొత్తం 19 దరఖాస్తులు రాగా 14 దరఖాస్తులు ఆమోదించడం జరిగిందని మిగిలిన 5 దరఖాస్తులు పరిష్కార దశలో ఉన్నాయన్నారు. అదేవిధంగా పి ఎం ఈ జి పి కార్యక్రమం కింద 2025 -26 లో జూలై 8 నాటికి 408 దరఖాస్తులు బ్యాంకులకు పంపగా, వాటిలో 192 దరఖాస్తులు ఆమోదించబడ్డాయని తెలిపారు. ఇప్పటివరకు 347యూనిట్లు స్థాపించబడ్డాయని, బ్యాంకుల వద్ద పెండింగ్‌లో ఉన్న 149 దరఖాస్తులను త్వరితగతిన మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పారిశ్రామికవేత్తల అభ్యర్థనలను సమయానికి పరిష్కరించడం ద్వారా జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం కల్పించవచ్చని, దీనికి అన్ని శాఖల సమన్వయం కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ స్వాతి, డి ఆర్ డి ఎ పి.డి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా టూరిజం అధికారి కె.అప్పారావు, జిల్లా కార్మిక శాఖ అధికారి ఏ. లక్ష్మి, డిపిఓ కే అనురాధ,జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు



## లబ్ధిదారుల ముంగిటకే 'ఎన్టీఆర్ భరోసా', 1వ తేదీన ఉదయమే ఇంటివద్దనే పింఛన్ల పంపిణీ

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి“**

**భీమవరం బ్యూరో చీఫ్ జూలై 30 నంది పత్రిక** పశ్చిమ గోదావరి జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు సామాజిక భద్రతను మరింత బలోపేతంచేసే దిశగా ఆగస్టు 1వ తేదీన విస్తృత స్థాయిలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం కింద జిల్లావ్యాప్తంగా 25 రకాల పింఛన్లకు సంబంధించి మొత్తం 2,20,227 మంది లబ్ధిదారులకు రూ.96,01,99,000 విలువైన పింఛన్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వెల్లడించారు. ప్రతి నెల మాదిరిగానే ఈసారి కూడా పింఛన్లను లబ్ధిదారులకు సమయానికి అందించేందుకు సంబంధిత స్వర్ణ వార్డు మరియు స్వర్ణ గ్రామ సిబ్బందికి అవసరమైన ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 1వ తేదీ ఉదయం నుంచే సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నేరుగా పింఛన్లు అందజేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ సజావుగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పంపిణీ ప్రక్రియలో పారదర్శకత, సమర్థత పాటించాలని అధికారులను ఆదేశించారు. వృద్ధులు, వికలాంగులు మరియు ఇతర లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గౌరవప్రదంగా సేవలు అందించాలని సూచించారు.పింఛన్ల పంపిణీ బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బంది లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించి, మర్యాదపూర్వకంగా పింఛన్లు అందజేయాలని కలెక్టర్ ప్రత్యేకంగా సూచించారు. పంపిణీ సమయంలో ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి అర్హులైన లబ్ధిదారునికి పింఛన్ సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆచంట నియోజకవర్గంలో 28,039 మంది లబ్ధిదారులకు రూ.12,16,32,500 భీమవరం నియోజకవర్గంలో 29,937 మందికి రూ.13,08,20,000 నరసాపురం నియోజకవర్గంలో 26,492 మందికి రూ.11,44,28,000 పాలకొల్లు నియోజకవర్గంలో 28,451 మందికి రూ.12,38,42,000 తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 30,211 మందికి రూ.13,32,14,500 తణుకు నియోజకవర్గంలో 34,656



మందికి రూ.15,11,84,500 ఉండి నియోజకవర్గంలో 34,074 మందికి రూ.14,76,17,500. గణపవరం మండలంలో 8,367 మందికి రూ.3,74,61,000 పింఛన్లు నగదు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు..

## నారాయణపురం ఆనకట్టకు భారీగా వరదనీరు

శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం లాభాం పంచాయతీ వద్ద నారాయణపురం అనకట్టకు భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. నాగావళి నదిపై నిర్మించిన నారాయణపురం అనకట్ట జిల్లాలోని ప్రధాన నీటివనరుల్లో ఒకటి కావడంతో దీనిపై రైతులు ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. ఒడిశాలో వర్షాలు కారణంగా అనకట్ట వద్దకు భారీగా వరదనీరు చేరుతోంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక ఇబ్బంది పడుతున్న తరుణంలో అనకట్టకు సుమారు 1000 క్యూసెక్కుల నీరు చేరడం రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని ఏడు మండలాల్లో 37,053 ఎకరాలకు కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా నీరు అందుతుందని జలవనరుల శాఖ ఏఈ రామశివాజీ తెలిపారు.

## హిందుత్వ అంటే మన జీవనవిధానం

## మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్య

హిందుత్వం అంటే మతం కాదని.. జీవన విధానమని భారతదేశ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. దేశభక్తి సమాజ ఐక్యత లోపిస్తే దేశం వెనకపడుతుందని పేర్కొన్నారు. గురువారం కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో 'కర్మవీరులారా కదిలి రండి' గీతం ఆవిష్కరణ, విద్యార్థులతో మాటామంతిలో పాల్గొని వెంకయ్యనాయుడు ప్రసంగించారు. మంచి గీతాలు వినాలని, తద్వారా స్ఫూర్తిని పొందాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. వందేమాతరం గీతం మనందరికీ సమాధానమని తెలిపారు. అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని సూచించారు. శక్తివంతమైన భారత్ కావాలంటే యువతి, యువకుల పాత్రే కీలకమని ఉద్ఘాటించారు. మొబైల్ ఫోన్, యూట్యూబ్‌లపై యువత ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని చెప్పుకొచ్చారు. యువత మంచి గురువును ఎంచుకోవాలని, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను ఎక్కువగా చదవాలని సూచించారు. యువత తమ భవిష్యత్తును తామే నిర్దేశించుకునే స్థాయికి ఎదగాలని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

## మందుగుండు సామాగ్రి వివరాలు భద్రపరచండి

## సుప్రీంలో పెల్లెట్ గన్స్ వినియోగంపై విచారణ

జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో ఢిల్లీ పోలీసులు పెల్లెట్ గన్స్ వినియోగంపై వివాదం నడుస్తోంది. దీనిపై గురువారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జనసమూహాన్ని నియంత్రించే సమయంలో పోలీసుల బలప్రయోగం ఎలా ఉండాలనే అంశంపై అమలులో ఉన్న గ్రేడెడ్ యూజ్ ఆఫ్ ఫోర్స్ స్టాండింగ్ ఆర్డర్‌ను కోర్టు ముందు సమర్పించాలని ఆదేశించింది. వాడటానికి స్పష్టమైన రూల్స్ ఉండాలని జస్టిస్ బాగ్చీ వ్యాఖ్యానించారు. అదే సమయంలో పెల్లెట్ గన్స్‌నూ పూర్తిగా నిషేధించలేమని చెప్పింది. మరోవైపు పిటిసనర్ల తరుపున న్యాయవాది వాదిస్తూ.. ప్రస్తుతం అమలులో ఉన్న మార్గదర్శకాల్లో నిరసనల సమయంలో మెటాలిక్ పెల్లెట్ గన్స్ వినియోగానికి అనుమతి లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ అలాంటి ఆయుధాలు వాడకంపై పోలీసుల చర్యలపై విచారణ కోరారు. ఈ వాదనల్ని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం, క్రౌడ్ కంట్రోల్‌లో బలప్రయోగానికి సంబంధించిన అధికారికి స్టాండింగ్ ఆర్డర్‌ను రికార్డ్‌లో ఉంచాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. అత్యవసర పరిస్థితుల్లో పెల్లెట్ గన్స్ వాడే అధికారం పోలీసులకు ఉందని చెప్పింది. ఇదే సమయంలో పోలీసులు వాడిన మందుగుండు సామాగ్రికి సంబంధించిన వివరాలు భద్రపరచాలని ఆదేశించింది.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం



**గంగవరంలో ఇంటింటికీ తెలుగుదేశం కరపత్రాలు పంపిణీ చేసిన రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్,ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**

**రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**

**విజయవాడ బ్యూరో చీప్ జూలై 30 నంది పత్రిక** ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కూటమి పాలన సాగుతుందని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. గంగవరం మండలం పాత గంగవరం గ్రామంలో గురువారం తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి సౌజన్యంలో రెండేళ్ళ నమ్మకం, సంక్షేమం అభివృద్ధిపై “ఇంటింటికీ తెలుగుదేశం“లి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు పార్టీ శ్రేణులు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె ప్రతీ ఇంటికీ వెళ్ళి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు . దేశం గర్వించేలా అమరావతిని ఎకనామిక్ రీజియన్ గా మార్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దే అన్నారు. అలాగే మేనిఫెస్టోలో ఇవ్వని హామీలు కూడా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు . మాట ఇచ్చిన ప్రకారం ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు పెంచి అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించినట్లు పేర్కొన్నారు. 269 అన్నా క్యాంటీన్ లు ఏర్పాటు చేసి రూ;5/- లకే భోజనం అందిస్తున్న చరిత్ర మన కూటమి ప్రభుత్వానిదన్నారు. గృహిణులకు సంవత్సరానికి దీపం పథకం ద్వారా అందించే 3 గ్యాస్ సిలిండర్ లు రాయితీలుపై చైతన్యం చేశారు. గత ప్రభుత్వం అమ్మవడి పథకం ద్వారా ఒక ఇంట్లో చదువుకునే అందరికీ అమలు చేస్తామన్న జగన్ కేవలం ఒక విద్యార్థికి మాత్రమే అమలు చేయడం సిగ్గుచేటన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కుటుంబంలో అందరి పిల్లలకు తల్లికి వందనం పూర్తి పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. చేనేతలకు, నాయి బ్రాహ్మణులకు ఉచితం విద్యుత్ అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. రైతన్న కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా, వగైరా అవసరమైన ఎరువులు సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా అంద జేస్తున్నామన్నారు. అలాగే రైతులకు వారి వ్యవసాయ పనులు పెట్టుబడులకు అందజేసే అన్నదాత సుఖీభవ -ప్రావీ కిసాన్ పథకం ద్వారా ఎలాంటి తారతమ్యం లేకుండా నిధులు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవే కాకుండా అభివృద్ధిని కూడా పారదర్శకంగా అత్యంత వేగంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం కన్నా మెరుగైన పాలన అందిస్తున్న విధానాలపై చైతన్యం చేశారు. అలాగే సంక్షేమ పథకాలకు అర్హులైన వారు ఎవరైనా ఉంటే వారికి ఆయా సంక్షేమ పథకాలు అందించే బాధ్యత తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు ఆటో డ్రైవర్ సేవలో భాగంగా రూ;15000/- లు అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. అర్హత కలిగిన ఏ ఒక్క లబ్ధిదారు కూడా పథకాలకు దూరం కాకుండా ఆయా శాఖల అధికారులు అర్హులైన వారి జాబితా సిద్ధంచేసి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఇప్పటికే 5 లక్షల గృహాలు పేదలకుఅందించామన్నారు. మత్స్య కారుల సేవలో భాగంగా ఏటారూ;20,000/- లు అందిస్తున్నట్లు తెలిపారు. గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం రాయితీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. దివ్యాంగ శక్తి పథకం ద్వారా 31 లక్షల ప్రయాణాలు కల్పించినట్లు పేర్కొన్నారు. అలాగే ఆయా పథకాల్లో ఎక్కడ ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అమలు చేసే బాధ్యతను తీసుకున్నట్లు స్పష్టం చేశారు. పలు సమస్యలపై ఆమెకు వినతులు రాగా స్పందించిన ఆమె ఆయా శాఖల అధికార యంత్రాంగానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి,ప్రధాన కార్యదర్శి కనిగిరి సుభాష్, క్లస్టర్ ఇంచార్జీ దుమ్ముల భాను ప్రసాద్ , బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఈరోజు స్వప్న కుమారి, తెలుగుదేశం నాయకులు వీరవతుల రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, మాజీ ఎంపీటీసీ కోసు బుల్లియమ్మ, జనసేన మండల పార్టీ అధ్యక్షులు కుంజం సిద్దు , బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు పుట్టపల్లి టి ఎన్ ఎస్ ఎఫ్ నియోజక వర్గ ప్రతినిధి ముచ్చకర్ల శివ , పి .ఆది నారాయణ, గంగవరం మాజీ సర్పంచ్ కలుముల అక్కయమ్మ, బీజేపీ జిల్లా అధ్యక్షులు ఈకా బుల్లికొండలు దొర, ప్రతినిధులు సత్యనారాయ ణమ్మ, వెంకటేశ్వర్లు , కృష్ణ, కూటమి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# బాల బాలికల ఆరోగ్యానికి

# శ్రీరామరక్ష ఆర్ బి ఎస్ కే పథకం





## 0-18సం"ల చిన్నారులకు ప్రయోజనకారి

## పుట్టుకతో వచ్చే లోపాలపై ముందస్తు గుర్తింపు - నివారణే ధ్యేయం

## ప్రభుత్వ, ప్రభుత్వ ఒప్పందంతో నడిచే ఆసుపత్రుల్లో ఉచితంగా పూర్తి చికిత్స

## ముఖ్యఅతిథిగా ఆరోగ్య కుటుంబ సంక్షేమ&వైద్య విద్యశాఖ శాఖల మంత్రి సత్యకుమార్ యాదవ్

## రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

విజయవాడ బ్యూరో చీఫ్ జూలై 30 నంది పత్రిక

భావితరాల ఆశాజ్యోతుల ఆరోగ్య రక్షణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధతో పనిచేస్తుందని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రంపచోడవరం మండలం (ముసురుమిల్లి) బోర్నగూడెం ఆశ్రమ పాఠశాలలో గురువారం రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం 2.0 ని జిల్లా వైద్యారోగ్యాధికారి పి. సరిత అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆరోగ్య కుటుంబ సంక్షేమ వైద్య విద్యశాఖల మంత్రి వర్యులు సత్య కుమార్ యాదవ్ మరియు రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి కి సాదర స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ దినేష్ కుమార్ సౌజన్యంలో నిర్వహించిన సమావేశంలో తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి మా తెలుగుతల్లికి. మల్లెపూదండ పాటతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం ప్రోగ్రాం ద్వారా 0నుండి18 సం"ల చిన్నారులకు ఉచితంగా అందించే వైద్య సేవలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. పుట్టిన నాటి నుండి పుట్టుకతో వచ్చే ఆరోగ్య లోపాలు, పోషకాహార లోపం మరియు శారీరక,మానసిక ఎదుగు దల లోపం ద్వారా వైకల్యాలను ముందస్తుగా గుర్తించి వాటి నివారణ పై చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పుట్టుకతో వచ్చే వినికిడి లోపాలు, గుండె సంబంధ వ్యాధులు,అంగ వైకల్యాలు ఇలా అనేక రకాల వ్యాధులకు ఈ పథకం ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందిస్తూ మెరుగైన జీవితాలను అందిస్తున్నట్లుస్పష్టం చేశారు. ఇప్పటికే అనేక ఆసుపత్రుల్లో వైద్యసేవలు రీత్యా మెరుగైన సేవలు కోసం మంచి వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా ప్రస్తుతం ఈ పథకం మన పోలవరం జిల్లాలో ప్రారంభోత్సవం చేయడం శుభప్రదమన్నారు. చాలామటుకు తన దృష్టిలోకి వచ్చిన అనేకమంది చిన్నారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సేవలు అందించినట్లు పేర్కొన్నారు . ఏదైనా ఒక వ్యాధిని ప్రారంభంలో గుర్తిస్తే మంచి వైద్యం పొందే అవకాశం ఉందన్నారు. ఒక వైద్య శాఖ వారే వచ్చి వైద్యసేవలు అందిస్తారన్న కారణంతో కాకుండా కుటుంబ సభ్యులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉందన్నారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ & వైద్యవిద్య శాఖల మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ పథకం ద్వారా జీవన నాణ్యత ప్రమాణాలు పెంపుపై ప్రత్యేకశ్రద్ధతో పనిచేస్తుందన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ స్థాపనే కూటమి ప్రభుత్వం ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం ఇక్కడ ప్రారంభోత్సవం చేసిన ఈ పథకం ద్వారా అంగన్వాడీ స్థాయిలో నుండి ఉన్నత స్థాయి విద్య వరకు ఈ పథకం అమలుకు సంబంధించి పలు విషయాలపై క్షుణ్ణంగా వివరించారు. దీని అమలుకు నియోజక వర్గ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి అంగన్వాడీ స్థాయిలో సం"నికి రెండు పర్యాయాలు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో 6నుండి18 సం"ల చిన్నారులకు సం"లో ఒకసారి ప్రత్యేక వైద్య చికిత్సలు చేస్తాయన్నారు. కేవలం ప్రభుత్వ పాఠశాలలతో పాటూ ఎయిడెడ్ పాఠశాల్లో విద్యార్థులకు కూడా వైద్య సేవలు అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రాథమిక స్థాయిలో లోపాలు గుర్తించడం వాటికి ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్కడా నయం కాకపోతే ప్రభుత్వ అనుమతి పొందిన ప్రయివేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని తద్వారా ఆరోగ్యకరమైన జీవితాలు అందించాలన్న సదుద్దేశ్యంతో దీనిని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాముఖ్యంగా 38 రకాల వ్యాధులకు ఇక్కడ పూర్తిగా ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. 63లక్షల మందికి చిన్నారులకు దీని ద్వారా ప్రయోజనం ఉందన్నారు. (1) పుట్టుకతో వచ్చే లోపాలు,(2) , పోషకాహార లోపాలు (3)బాల్యవ్యాధులు మరియు (4) ఎదుగుదల లోపాలు వైకల్యాలపైలి పూర్తిగా ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. అక్కడ నయం కాకపోతే ప్రభుతత్వ అనుమతి పొందిన ప్రయివేట్ ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. చాలా మట్టుకు విద్యార్థులు మొబైల్ ఫోన్ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. కేన్సర్ వ్యాధి వల్ల కూడా నష్టాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఏదేమైనా ఏ రోగన్నైనా ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యమన్నారు. చిన్నారులు కూడా ఎలాంటి లోపాలు ఉన్నా పాఠశాల యాజమాన్యానికి, కుటుంబ సభ్యులకు తెలియజేయాలని ఎలాంటి న్యూనతకు గురికావొద్దన్నారు. సాధ్యమైనంత వరకూ ఆరోగ్యకరమైన జీవన విధానాలు కూడా పాటించాలన్నారు. చాలా మట్టుకు ప్రభుత్వ వైద్య సేవల్లో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. గిరిజన ప్రాంతంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు కూడా చిత్తశు ద్ధితో పనిచేయాలని అభినందించారు. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ గారి పనితీరుపై ఆయన ప్రశంసించారు. సమావేశంలో పలు వినతులు రాగా స్వీకరించిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, మంత్రి వర్యులు సత్య కుమార్ యాదవ్ లు సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కారం చేయాలని సూచించారు. పరిష్కారంలో తాత్సారం లేకుండా చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి తదితరులు ఆరోగ్యకరమైన సమాజం కోసం కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న పలు విషయాలపై వివరించారు. కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులతో మాట్లాడించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన పథకాల ద్వారా పొందిన లబ్ధిపై వారి యొక్క స్వీయ అనుభూతి వెల్లడించారు.

కార్యక్రమంలో కలెక్టర్ కొత్తమాసు దినేష్ కుమార్, ఆర్డిఓ స్వాతి, ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.కాశీ విశ్వనాథ్ రెడ్డి, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ సభ్యులు షేక్ సుభానీ,మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు అడబాల బాపిరాజు, నియోజకవర్గ ఎస్టీ విభాగం అధ్యక్షుడు పండా బాపన్న దొర అనే బాబీ , సీతపల్లి దేవస్థానం గడి బాపనమ్మ తల్లి ధార్మిక మండలి సభ్యులు సిద్దా వెంకన్నదొర, కడబాల గణపతిరెడ్డి, బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షులు ఈక బుల్లికొండలు దొర, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఈరోజు స్వప్న కుమారి, బీజేపీ మండల నాయకులు బాలు రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి బాధ మోహన రావు, మాజీ సర్పంచ్ వై.నిరంజనీ దేవి, ఆరోగ్యశాఖ అధికారి కె. పద్మావతి, డి ఎం హెచ్ ఓ పి.సరిత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.





# ప్రతిపక్షంగా విఫలం అవుతున్న కాంగ్రెస్ !

ఈ దేశ దౌర్భాగ్యం ఏమంటే అసమర్థ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండడం. అధికారంలో ఉంటే అవినీతికి పాల్పడడం, కుంభకోణాలను చేయడం, పాలనను గాలికి వదిలి వేయడం చూశాం. పదేళ్ల యూపిఎ పాలనలో మన్మోహన్ సింగ్‌ను ముందుకు పెట్టి ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేం. అలాగే ప్రతిపక్షంలో గత పదేళ్లుగా నిర్మాణాత్మక పాత్ర పోషించడంలోనూ విఫలం అవుతూ వస్తోంది. నిజానికి ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షానిదే బలమైన పాత్ర అని చెప్పాలి. దీనిని గుర్తించి నడచుకోవడంలో కూడా కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యింది. అధికార ఎన్‌డిఎ తప్పుడు పనులు చేస్తుంటే నిలదీయడం లేదు. ఆశ్రిత పక్షపాతం చూపితే నిలదీయడం లేదు. ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేయడం లేదు. ఎందుకంటే ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతి, కుటుంబ పాలన కాంగ్రెస్‌లో నరనరాన జీర్ణించుకుపోయింది. ఇంట్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు పార్లమెంట్‌లోనే ఉన్నారు. కుటుంబ పాలనకు ఇదే నిదర్శనం. ఇకపోతే పార్లమెంట్ సమావేశాల్లో కూడా బలంగా ప్రజల వాణిని విన్పించడం లేదు. కాక్రోచ్ పార్టీకి వస్తున్న ఆదరణను తమ ఖాతాలో వేసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. వారి ఉద్యమాన్ని హైజాక్ చేసి లబ్ధి పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ క్రమంలో వారుచేస్తున్న ఆందోళనలు ఎబ్బెట్టుగా ఉన్నాయి. తాజాగా పార్లమెంట్ లోపలా బయటా విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశించారో చెప్పాలన్న డిమాండ్ చేస్తున్నారు. పార్లమెంట్ బయట ప్లకార్డులు పట్టుకుని ఆందోళనకు దిగారు. అందరూ గతంలో పాలన చేసిన వారే. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ అంతా పాలకులుగా ఉండివచ్చిన వారే. లాఠీ ఛార్జ్ చేయమని హోంమంత్రి ఆదేశిస్తారా అన్నది కూడా తెలియని వారు మన పాలనా వ్యవస్తలో ఉండడం దౌర్భాగ్యం. పోలీస్ మాన్యువల్ కూడా తెలియకుండా రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతున్నారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ తప్పితే పోలీసులే నిర్ణయం తీసుకుని లాఠీఛార్జ్ చేస్తారు. నిషేధిత పార్లమెంట్ పరిసరాల్లో, ప్రధాని నివాసం వద్ద ఎలాంటి ఆందోళనలు జరిగినా తప్పకుండా కంట్రోల్ చేస్తారు. ఇదికూడా తెలియ నట్లుగా ప్లకార్డులు పట్టుకుని లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలిచ్చారో చెప్పాలని నినాదాలు చేయడం సిగ్గుచేటు. ఇది కేవలం రాజకీయంగా చేస్తున్న ఆందోళన తప్ప ఇందులో చిత్తశుద్ధి లేదని వారికి కూడా తెలుసు. అసలు కాంగ్రెస్ నిర్మాణాత్మకంగా వ్యవహరించి ఉంటే ఇవాళ విద్యార్థులు రోడ్డుకెక్కాల్సిన అవసరం వచ్చి ఉండేది కాదు. జూన్ 6న సీజేపీ ఏర్పడడంపై వచ్చిన ప్రతిస్పందన చూసిన తర్వాతగానీ కాంగ్రెస్ గళం విప్పలేదు. మే మొదటి వారంలో పేపర్ లీక్ జరిగి, మే 12న పరీక్ష రద్దయిన తర్వాత కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిస్పందించి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసేందుకు చేయాల్సినన్ని ప్రయత్నాలు చేయలేదు. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటాలో 'ఛాత్రోంకి గుంజ్' పేరిట విద్యార్థుల ర్యాలీని నిర్వహించిన రాహుల్‌గాంధీ ఆ తర్వాత 23 రోజుల పాటు అదృశ్యమై జర్మనీలో కాలక్షేపం చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు ఢిల్లీలో ప్రవేశించి తమ ఆందోళన తీవ్రతరం చేసిన తర్వాత, పార్లమెంటు సమావేశాలు మరో మూడు రోజుల్లో జరుగుతా యనగా రాహుల్‌లో కలవరం కలిగింది. అందుకే అమాంతంగా లేచి ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు. రాజకీయాల్లో నిరంతరత్వం, నిత్య క్రియాశీలత్వం లేకపోతే పరిస్థితి మరొకరి చేతుల్లోకి వెళుతుందన్న విషయం రుజువైంది. మునుపటిలాగా నాటకీయంగా ధర్నాలు చేయడం, అరెస్టు కావడం వల్ల ప్రజల సానుభూతి లభించదని కాంగ్రెస్ గ్రహించాలి. 2014 నుంచీ పార్లమెంట్‌ను కాంగ్రెస్ స్తంభింపజేయడం, నిరసన ప్రదర్శనలు నిర్వహించడం వంటివి చేస్తూనే ఉన్నది. అందంతా కేవలం నాకీయ రాజకీయ ప్రయోజనం కోరి చేస్తున్నవే. కేవలం నెలరోజుల నిరసనతో కాక్రోచ్ పార్టీ ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేయగలిగింది. అటువంటి నైతిక స్థైర్యం కాంగ్రెస్, ప్రతిపక్షాలకు ఎందుకు లేకుండా పోయిందన్నదే ప్రశ్న. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడానికే కాదు, పరీక్షల్లో అక్రమాలను నిరోధించేం దుకు ప్రభుత్వం ఆగమేఘాలపై బిల్లు తేవడానికి, ప్రధానమంత్రి రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ బిల్లు గురించి ప్రకటించడానికి సిజెపి ఉద్యమమే కారణం.

# చైనా నుంచి ఇరాన్‌కు ఆయుధాలు

## చైనా తీరుపై ట్రంప్ అసహనం

అమెరికా విమానాలు, హెలికాప్టర్లకు తలనొప్పిగా మారిన కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమైంది. వీటి రవాణాకు పాకిస్థాన్‌ను మార్గంగా ఎంచుకొన్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ సంచలన కథనం ప్రచురించింది. దీంతో అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. పాక్ పేరు ఎత్తకుండా చైనాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చైనా ఆయుధాల సరఫరా విషయం తెలుసుకొని తాను నిరాశకు గురైనట్లు పేర్కొన్నారు. తాము ఇరాన్‌కు ఆయుధాలు విక్రయించ బోమని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్వయంగా తనకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చైనా, రష్యాల నుంచి ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని గత వారం ట్రంప్ హెచ్చరికలు కూడా జారీ చేశారు. చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకు పైగా విలువైన 400 షోల్డర్గ్÷ర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం జరిగింది. వీటితో తమ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరాన్ భావిస్తోంది. అయితే.. ఈ డీల్‌కు టెహ్రాన్ పక్షాన హాంకాంగ్ చెందిన ఝూంగ్‌కింగ్ బావోషాంగ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మధ్యవర్తిగా ఉంది. ఈ క్షిపణులను ఉత్తర చైనా నుంచి పాకిస్థాన్ మీదుగా ఇరాన్‌లోకి చేర్చాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కాకపోతే వీటిని భూమార్గంలో తరలిస్తారా..? గగనతలంలో తీసుకెళతారా అనే అంశంపై స్పష్టత లేదు. అయితే ఈ కథనాలను చైనా కొట్టిపారేయడం గమనార్హం. ఈ క్రమంలోనే తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అంశంపై స్పందించారు.

## ఫ్రాన్‌లో విధ్వంసం సృష్టిస్తున్న కార్చిచ్చు

## మంటలను ఆర్పేందుకు శ్రమిస్తున్న వేలాదిమంది సిబ్బంది

ఫ్రాన్స్ నైరుతి ప్రాంతంలోని గిరోండ్ అడవుల్లో చెలరేగిన కార్చిచ్చు భారీ విధ్వంసం సృష్టిస్తోంది. ఇప్పటికే వేలాది హెక్టార్ల అడవి అగ్నికి ఆహుతి అయింది. తీవ్ర వేడి, దీర్ఘకాలిక కరువు పరిస్థితులు, బలమైన గాలులు మంటలను మరింత వేగంగా వ్యాపింపజేసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది .ఈ కార్చిచ్చు ఇప్పటివరకు పారిస్ నగర వైశాల్యానికి నాలుగు రెట్లకు సమానమైన ప్రాంతాన్ని దహనం చేసింది. లక్షలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వేలాది మంది అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల సెల్సియస్ వరకు చేరే అవకాశం ఉందని వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు. పొడి గాలుల కారణంగా ఇప్పటికే అదుపులోకి వచ్చిన ప్రాంతాల్లో కూడా మంటలు మళ్లీ చెలరేగవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే కొన్ని ప్రాంతాల్లో ప్రజలు తిరిగి ఇళ్లకు వెళ్లకుండా ఆంక్షలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం భారీ మంటలు ఫ్రాన్స్‌లోని అణు కేంద్రాలు, రఫేల్ యుద్ధ విమానాల తయారీ యూనిట్ల వైపు వేగంగా దూసుకొస్తున్నాయి. ఫ్రాన్స్ అణ్వాయుధ వ్యవస్థకు సంబంధించిన ప్రదేశాలతో పాటు, అత్యంత కీలక రక్షణ, ఏరోస్పేస్ సౌకర్యాలున్న ప్రాంతానికి కేవలం 12 కిలోమీటర్ల దూరంలో మంటలు ఉన్నాయి. మంటల వల్ల ఈ కీలక కేంద్రాలకు నష్టం జరగకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మంటలు వ్యాపించకుండా ఉండేందుకు ఈ కేంద్రాలకు సమీపంలో ఉన్న చెట్లను బుల్డోజర్లతో తొలగిస్తున్నారు.

## విధి నిర్వహణలో భయానికి తావు లేదు

## నిజాయితీగా విద్యుక్త ధర్మం నిర్వహించండి

## సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. విధుల్లో ధైర్యసాహసాలు ప్రదర్శించిన సిబ్బందికి సన్మానం చేసిన కార్యక్రమంలో ఆయన ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. ఎలాంటి భయం లేకుండా పనిచేయాలని బలగాలకు పిలుపునిచ్చారు. సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్‌గా ఇక్కడ నేను మీకో హామీ ఇస్తున్నాను. విధులు నిజాయతీగా నిర్వర్తించడంలో మీరు తీసుకునే నిర్ణయాలు, చర్యలకు నేను బాధ్యత వహిస్తాను. ప్రజాప్రయోజనం కోసం తీసుకునే చర్యలకు జవాబుదారీగా వ్యవహరించాల్సి వస్తే.. దానిని నేను పూర్తిగా స్వీకరిస్తానని జ్ఞానేంద్ర తన సిబ్బందిని ఉద్దేశించి పేర్కొన్నారు. ఈ నెల 20న 'చలో పార్లమెంటు' నిరసనల సమయంలో భద్రతా విధులు నిర్వర్తించిన సీఆర్పీఎఫ్-ఆర్ఏఎఫ్ బలగాలు, పోలీసులు.. విద్యార్థులపై పె÷-లలెట్ గన్‌లతో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతోన్న వేళ.. జ్ఞానేంద్ర ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఆరోపణలపై సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ అంతకుముందు కూడా స్పందించారు. ఏదైనా భారీ ఆపరేషన్ తర్వాత తాము వృత్తిపరమైన మూల్యాంకనం చేపడతామని చెప్పారు. నిరసనకారులపై ఆర్ఏఎఫ్ సిబ్బంది తీసుకున్న చర్యల విషయంలోనూ ఆ పరిశీలన చేస్తామని తెలిపారు. అది తమ నిబంధనల్లో భాగమేనని చెప్పారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు దేశవ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర పోలీసులతో సహకరిస్తూ.. వైవిధ్య పరిస్థితులకు తగ్గట్టుగా వేగంగా స్పందించగల సామర్థ్యం వారి సొంతం. ఇక, ఏదైనా ప్రాంతంలో ఘర్షణలు, రద్దీ, అశాంతియుత పరిస్థితులను నెలకొన్నప్పుడు వాటిని నియంత్రించేందుకు సీఆర్‌పీఎఫ్‌లోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ను రంగంలోకి దింపుతారు.

# ఓటరు జాబితా సవరణతో పథకాలకు సంబంధం లేదు

## ప్రజలు అనవసర అపోహలకు గురి కావద్దు

## ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ

రాష్ట్రంలో ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా చేపడుతున్న ఓటరు జాబితా సవరణకు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ పక్రియ పురోగతిపై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లతో ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా డిజిటలైజేషన్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిఇఓ మాట్లాడుతూ కొనసాగుతున్న ఎస్ఐఆర్ పక్రియ కేవలం తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు మాత్రమేనని, ప్రభుత్వం పథకాలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించేందుకు మరో నాలుగు రోజులు గడువు మాత్రమే ఉన్నందున ఆగస్టు మూడవ తేదీలోగా డిజిటలైజేషన్ పక్రియ 100శాతం పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 76శాతం డిజిటలైజేషన్ పక్రియ పూర్తయిందని, గ్రామీణ ప్రాంతాల్లో 90శాతం పూర్తయిందని, ఇందులో ఖానాపూర్, బాల్కొండ, ఎల్లారెడ్డి, హజూర్ నగర్, నర్సంపేట్, వర్ధన్నపేట్, పరకాల, బోద్ నియోజకవర్గాల్లో 100శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఇందుకు సంబంధించిన అధికారులను సిఇఒ ప్రశంసించారు. శేరిలింగంపల్లి, రంగారెడ్డి, మేడ్చల్, జిహెచ్ఎంసితో పాటు నిజామాబాద్, వరంగల్, ఖమ్మం లిం పట్టణ ప్రాంతాలలో డిజిటలైజేషన్ పక్రియపై సంబంధిత డిఇఒలు ప్రత్యేక దృష్టి సారించి డిజిటలైజేషన్ పక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలను డిజటలైజేషన్ చేయడంలో ఓటరు పేర్లను తప్పులు లేకుండా అప్ లోడ్ చేసేలా బిఎల్ఒలు, సూపర్ వైజర్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇఆర్ఒ, ఎఇఆర్ఒలు దీనిపై సమీక్షించి తప్పులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. డిజిటలైజేషన్ లో నిర్లక్ష్యం వహించిన బిఎల్ఒలు, సూపర్ వైజర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఇఒ హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ స్టేషన్ల రాష్నలైజేషన్ పక్రియను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఒకే కుటుంబ సభ్యుల పేర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. ఓటర్లలో మరణించిన వారు, ఇల్లుమరిన వారి వివరాలు, అందుబాటులో లేని వారి జాబితాను సిద్ధంచేసేటప్పుడు అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన బిఎల్ఏల సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఇఆర్ఒ, ఎఇఆర్ఒ, బిఎల్ఒ స్థాయిలలో జరిగే రాజకీయ పార్టీల సమావేశాలను వీడియోగ్రాఫ్ చేసి డాక్యుమెంట్ చేయాలన్నారు. దాంతోపాటు విఐపి, వివిఐపిల ఓటర్లను గుర్తించి మ్యాపింగ్ చేయాలన్నారు.

## శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం

కృష్ణా నది ఎగువ పరివాహ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 79,403 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుతోంది. శ్రీశైలం నీటిమట్టం గురువారం ఉదయం 6 గంటలకు 824.80 అడుగులు.. నీటి నిల్వ 44.6090 టీఎంసీలుగా నమోదయింది. శ్రీశైలం కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించలేదు. వరద ఉద్ధృతితో జూరాల జలాశయం కళకళలాడుతోంది. కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి మూడు రోజులుగా దిగువకు కృష్ణా

# పరకాల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి








పరకాల నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్యశారదలతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. డీఆర్‌డీఏ, మున్సిపాలిటీ, నీటిపారుదల, వ్యవసాయం, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, మిషన్ భగీరథ, వైద్య ఆరోగ్యం, విద్య, విద్యుత్, రెవెన్యూ, హౌసింగ్, ఎస్సీ కార్పొరేషన్ తదితర శాఖల అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనులు గడువులోగా నాణ్యతతో పూర్తి కావాలని సూచించారు. మొక్కజొన్నకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. రహదారుల నిర్మాణం, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వీవో భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, నీటి ట్యాంకులను షెడ్యూల్ ప్రకారం శుభ్రపరిచి రికార్డులు నిర్వహించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, టెక్స్టైల్ పార్కు అభివృద్ధి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్‌సెంటర్ల భవనాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా శాఖల సమన్వయంతో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రవి, సంధ్యారాణి, వై.వి.గణేష్, శేషాద్రి, డీఆర్వోలు శ్రీనివాస్, విజయలక్ష్మి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.ూా

# జిల్లా యంత్రాంగం అప్రమత్తతతో పనిచేయాలి




రానున్న రెండు నుంచి మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయి అప్రమత్తతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. జిల్లా, మండల స్థాయిలో ప్రత్యేక విపత్తుల నివారణ కమిటీలను వెంటనే ఏర్పాటు చేసి, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో సమన్వయంగా పనిచేయాలని, స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు మీడియాకు సమాచారం అందించాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేయాలని, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వాగులు, చెరువులు, కుంటల పరిస్థితిని ఇరిగేషన్ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించి ప్రతిరోజూ నివేదికలు సమర్పించాలన్నారు. జిల్లాలో ప్రజలు, పశుసంపద, పంటలు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఏదైనా విపత్తు లేదా నష్టం జరిగిన వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించేందుకు ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని, మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, వరదల సమయంలో అవసరమైన సహాయక సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, అవసరమైతే వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణలను అరికట్టాలని, భారీ వర్షాలు కురిసే పరిస్థితుల్లో రిలీఫ్ క్యాంపులు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. పట్టణాల్లో డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసి అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ మండల స్థాయిలో విపత్తుల నిర్వహణ కమిటీలు సమావేశాలు నిర్వహించాలని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపట్టాలని అన్నారు. వాగులు, కాలువలు, చెరువులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైతే మత్స్యకారులు, బోట్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విపత్తులను సమర్థంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రజల కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 7995074803 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పురుషోత్తం, డీఆర్వో నాగలక్ష్మి, డీపీఓ రేవంత్, వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, ఉద్యానవన శాఖ అధికారి జి. మరియాన్న, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులను చదవడం, రాయడంలో ఉత్తమంగా ఉండేలా తీర్చిదిద్దాలి








**-హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
**-ఆత్మకూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్**

విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేలా, చదవడం, రాయడం, భావవ్యక్తీకరణలో మెరుగైన నైపుణ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి నిర్మల కుమారిని కలెక్టర్ పాఠశాలలో ప్రస్తుతం ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎంతమంది కొత్తగా ప్రవేశాలు పొందారని అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఇన్-సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. శిక్షణలో ఉపాధ్యాయులకు బోధనలో అనుసరించాల్సిన ఆధునిక పద్ధతులు, విద్యార్థి కేంద్రిత అభ్యాస విధానాలు, ప్రాథమిక భాషా మరియు గణిత నైపుణ్యాల పెంపు, నిరంతర మూల్యాంకన విధానాలపై అందిస్తున్న శిక్షణను పరిశీలించి ఉపాధ్యాయులతో చర్చించారు. పాఠశాలలో ఉన్న లైబ్రరీని పరిశీలించారు. వంటగదిని పరిశీలించి విద్యార్థుల కోసం వండుతున్న భోజన పదార్థాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉన్న టాయిలెట్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఏడో తరగతి విద్యార్థులకు భారతరత్న సర్ సివి రామన్ సంబంధించి ఆంగ్ల పాఠ్యాంశం ఉపాధ్యాయురాలు బోధిస్తుండగా కలెక్టర్ తరగతి గదిని సందర్శించారు. ఏ పాఠ్యాంశాన్ని చదువుతున్నారని విద్యార్థులను కలెక్టర్ అడగగా సివి రామన్ లెసన్ అంటూ బదులిచ్చారు. హూ వాజ్ సీవీ రామన్ అని ఆంగ్లంలో కలెక్టర్ అడుగగా గ్రేట్ సైంటిస్ట్ అంటూ విద్యార్థులు ఆంగ్లంలోనే సమాధానం ఇచ్చారు. దీంతో వెరీ గుడ్ అంటూ విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ఆంగ్లంలో ఉన్న ఆ పాఠ్యాంశాన్ని విద్యార్థుల చేత కలెక్టర్ చదివించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ విద్యార్థులు విద్యా ప్రగతిలో ఉత్తమంగా నిలవాలంటే పాఠ్యాంశాన్ని బోర్డు మీద రాయడం కాకుండా డిక్టేషన్ గా ఉపాధ్యాయులు చెప్పడం ద్వారా విద్యార్థులు సొంతంగా రాయడం, చదవడంపై పట్టు సాధించగలరని అన్నారు. విద్యార్థులను ఇంగ్లీషులో బాగా రాయడం, చదవేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ గ్రామ సర్పంచ్ మహేశ్వరి, ఎంఈఓ విజయ్ కుమార్, తహసీల్దార్ జగన్ మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com